# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

బుధవారం | 14 జనవరి , 2026 | పేజీలు :08


## నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 4067 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



**ప్రజాపక్షం/నిజాంసాగర్:**ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వరప్రదాయిని అయిన నిజాంసాగర్ ప్రాజెక్టులోకి మంగళవారం 4067 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుందని నిజాంసాగర్ ప్రాజెక్టు ఏఈ సాకేత్ మంగళవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. సింగూరు ప్రాజెక్టు నుండి నీటిని విడుదల చేయడంతో మంజీరావాగు ద్వారా ఈ నీరు వచ్చి చేరుతుందని పేర్కొన్నారు. నిజాంసాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు కాగా ప్రస్తుతం 1402.65 అడుగుల నీరు నిల్వ ఉందని, ప్రాజెక్టు ప్రధాన పంట కాలువ ద్వారా 700 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు, రైతులు, పశువుల కాపర్లు ఎవరూ నీటి ప్రవాహంలోకి దిగరాదని సూచించారు.

## పకడ్బందీగా రోడ్డు భద్రతా చర్యలు

### బ్లాక్ స్పాట్స్ గుర్తించి.. నియంత్రణ చర్యల ప్రణాళిక సిద్ధం చేయాలి
### ప్రతి నెలలో రోడ్ సేఫ్టీ సమావేశం నిర్వహిస్తాం
### ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** రోడ్డు భద్రతా చర్యలు పకడ్బందీగా చేపట్టాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. రోడ్డు సేఫ్టీ కమిటీ సమావేశాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం ఆర్ అండ్ బీ, నేషనల్ హైవేస్, పీ ఆర్, పోలీస్, ట్రాన్స్ పోర్ట్, వైద్య, ఎక్సైజు, విద్య, ఆర్టీసీ తదితర శాఖల అధికారులతో రోడ్డు సేఫ్టీ కమిటీ ఛైర్ పర్సన్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా గతనెలలో నిర్వహించిన రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం సందర్భంగా చర్చించిన అంశాలపై సమీక్ష చేశారు. రవాణా, ఆర్ అండ్ బీ, నేషనల్ హైవేస్, పోలీస్ శాఖ సంయుక్తంగా చేసిన క్షేత్రస్థాయి పరిశీలనపై ఆరా తీశారు. సిద్దిపేట నేషనల్ హైవే, వేములవాడ కోరుట్ల మార్గం, కరీంనగర్ కామారెడ్డి మార్గం, సిరిసిల్ల – కరీంనగర్ మార్గంలో గుర్తించిన బ్లాక్ స్పాట్స్ వద్ద రంబుల్ స్ట్రిప్స్, సోలార్ సిగ్నల్స్, సైన్ బోర్డ్స్, రోడ్ల మరమ్మతు, కనెక్టింగ్ రోడ్ల కోసం పక్కా ప్రణాళిక తయారు చేసి, వచ్చే సమావేశంలో దానికి సంబంధించిన, అభివృద్ధి పనుల వివరాలను తెలుపాలని ఆదేశించారు. అలాగే పై రహదారుల్లో స్పీడ్ గన్స్, సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆయా శాఖల అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, ఇప్పటికే ఉన్న వాటిని మరోసారి పరిశీలించాలని సూచించారు.

**ఫ్లెక్సీలు ఏర్పాటు చేయించాలి..**

జిల్లాలోని అన్ని పెట్రోల్ బంక్ లలో కచ్చితంగా నో హెల్మెట్ నో పెట్రోల్ అమలు చేయాలని, ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించేందుకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ప్రతి బంకు యజమాని సామాజిక బాధ్యతగా దీనిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎక్కువ రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ మరణాలు, క్షతగాత్రులు అవుతుంది ద్విచక్ర వాహనదారులేనని స్పష్టం చేశారు. తమ, కుటుంబ సంరక్షణ కోసం హెల్మెట్ తప్పకుండా ధరించాలని సూచించారు. పరిమితికి మించి విద్యార్థులను, ప్రయాణీకులను తరలిస్తున్న ఆటోలు, బస్సులను తనిఖీ చేయాలని, ఓవర్ లోడ్ తో వెళ్ళే సరుకు వాహనాలపై దృష్టి సారించాలని రవాణా శాఖ అధికారులను ఇంచార్జి కలెక్టర్ ఆదేశించారు. రోడ్డు ప్రమాద బాధితులకు అత్యవసర వైద్య సదుపాయం, క్షతగాత్రులను హాస్పిటల్ కు తరలించి ప్రాణాలు కాపాడే వారికి రహవీర్ అర్థిక సహాయంపై సమీక్ష చేశారు.

**అరైవ్.. అలైవ్ అమలు..**

జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అరైవ్ అలైవ్ జిల్లాలో 10 రోజులపాటు అమలు చేస్తామని ఎస్పీ మహేష్ బీ గీతే తెలిపారు. ఇందులో భాగంగా ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రత నియమాలు పై అవగాహన కల్పించేందుకు వ్యాస రచన, క్విజ్, ఇతర పోటీలు విద్యార్థులకు, యువతకు నిర్వహిస్తామని వివరించారు. సిరిసిల్ల, వేములవాడలో ప్రధాన రోడ్లపై ఆక్రమణలు తొలగించాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. బ్లాక్ స్పాట్స్, ఇతర రద్దీ స్థలాల్లో బారికేడింగ్ చేయిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్టీఏ సభ్యుడు సంగీతం శ్రీనాథ్, ఈఈ ఆర్ అండ్ బీ నరసింహాచారి, డీటీఓ లక్ష్మ ణ్, ఈఈ పీఆర్ సుదర్శన్ రెడ్డి, నేషనల్ హైవే డీఈ అన్నయ్య, ఆర్ అండ్ బీ డీఈ శాంతయ్య, డీఈఓ వినోద్ కుమార్, జిల్లా వైద్యాధికారి రజిత, ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్ రావు, జిల్లా పౌర సరఫరాల అధికారి చంద్రప్రకాశ్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, అన్వేష్, సిరిసిల్ల ఆర్టీసీ డీఎం ప్రకాష్ రావు తదితరులు పాల్గొన్నారు.

## రిజిస్ట్రేషన్లలో ప్రభుత్వ మార్గదర్శకాలు పాటించాలి

### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/కరీంనగర్:**భూములు, ప్లాట్ల రిజిస్ట్రేషన్లలో ప్రభుత్వ నిబంధనలు మార్గదర్శకాలు తూచా తప్పకుండా పాటించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సబ్ రిజిస్ట్రార్లను, తహసిల్దార్లను ఆదేశించారు. రెవిన్యూ డివిజనల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సబ్ రిజిస్ట్రార్లు, తహసిల్దార్లు, సుడా అధికారులతో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయితో కలిసి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సమావేశం నిర్వహించారు. భూముల రిజిస్ట్రేషన్లు, నిషేధిత జాబితా, లేఅవుట్ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత సమావేశంలో చర్చించిన విధంగా అన్ని శాఖల వద్ద నవీకరించిన భూముల నిషేధిత జాబితా ఒకే రకంగా ఉండేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ జాబితా సబ్ రిజిస్టర్, రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్, తహసిల్దార్ స్థాయిలో తప్పక అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈ జాబితాకు సంబంధించిన ప్రతిని కార్యాలయాల్లో అందరికీ అందుబాటులో ఉండే చోట ప్రదర్శించాలని తెలిపారు. కొనుగోలు, అమ్మకం దారులు భూముల రిజిస్ట్రేషన్ కు వెళ్లే ముందు తగిన కొన్ని సూచనలను తెలియజేస్తామని, ఈ మార్గదర్శకాలు కొనుగోలు, అమ్మకం దారులు చదువుకునేలా ఏర్పాటు చేయాలని తెలిపారు. కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం, ఇంటి నెంబరు ఆధారంగా రిజిస్ట్రేషన్ చేయాల్సి వస్తే మున్సిపల్ నుండి జారీ చేసిన ఎస్ఓపి ఉత్తర్వుల్లోని మార్గదర్శకాలు అనుసరించాలని అన్నారు. అక్రమంగా ఉన్న హౌస్ నెంబర్లు ఇప్పటికే రద్దు చేశామని, ఆ జాబితా అన్ని సబ్ రిజిస్టర్ ఆఫీసర్లకు పంపిస్తామని తెలిపారు. రిజిస్టర్ చేసే ముందు రిజిస్ట్రారు ప్రభుత్వ నిబంధనలన్నీ పరిగణలోకి తీసుకోవాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే సిసిఏ రూల్స్ ప్రకారం చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్లాట్ల రిజిస్ట్రేషన్ కు ముందు లేఅవుట్ ప్రక్రియను పరిశీలించాలని అన్నారు.

**తహసిల్దార్లతో సమావేశం**

ప్రజాసేవలో రెవెన్యూ శాఖ కీలకపాత్ర పోషిస్తుందని కలెక్టర్ అన్నారు. తహసిల్దార్లు బాధ్యతాయుతంగా పనిచేయాలని, సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో సందర్శించాలని. తెలిపారు. ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, పారదర్శకంగా పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు, జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్, జిల్లా రిజిస్ట్రార్ పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

**ప్రజాపక్షం/నిజాంసాగర్:**జుక్కల్ నియోజకవర్గ పరిధిలోని బిచ్కుంద మున్సిపల్ పరిధిలో ఆయా కాలనీలలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా కల్వర్టుల నిర్మాణం, వరదనీటి నివారణ పనులు, మురికి నీటి కాలువల నిర్మాణం, అంతర్గత సిసిరోడ్లు తదితర మౌళిక సదుపాయాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ పనులు పూర్తయితే పట్టణ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే చెప్పారు. సుమారు 15 కోట్ల రూపాయల వ్యయంతో ఈ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రజా సేవలో ముందుండే సిబ్బందికి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, అధికారులు, ప్రజాప్రతినిదులు, స్థానిక మండల నాయకులు ప్రజలు పాల్గొన్నారు.



## ముగ్గుల ద్వారా ‘ పోష్ చట్టం – 2013’పై అవగాహన

సంక్రాంతి పండగను పురస్కరించుకుని జగిత్యాల జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జగిత్యాల జిల్లా కలెక్టరేట్ సముదాయంలో



వివరాలు మెయిన్‌లో...

# యూడిఐడి బ్లాక్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి: ఇన్‌చార్జి కలెక్టర్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** యూడీఐడీ బ్లాక్ (విభాగం) పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ (జీజీహెచ్)లో యూడీఐడీ కేంద్రం కోసం బ్లాక్ (విభాగం), ప్రత్యేక టాయిలెట్ నిర్మాణ పనులు, ఫర్నిచర్, ఇతర పనులను మంగళవారం పరిశీలించారు. యూడీఐడీ బ్లాక్ (విభాగం) ప్రవేశ ద్వారం వద్ద నేమ్ బోర్డు రాయించాలని, గోడలపై రంగులు వేయించాలని, ఆవరణ అంతా ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని సూచించారు. యూడీఐడీ కోసం వచ్చే దివ్యాంగులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, త్వరగా పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు.

**వంట గది ఆకస్మిక తనిఖీ..**

గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్లో పేషెంట్లకు భోజనాలు సిద్ధం చేసే గదిని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా ఆహార పదార్థాలు సిద్ధం చేస్తుండగా, వాటి నాణ్యతను, మెనూ, ఫ్రిడ్జ్, కూరగాయలు, గుడ్లు, ఆరటి పండ్లు, బియ్యం, పప్పులు పరిశీలించారు. వంట గదిలో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నిర్వహణపై కాంట్రాక్టర్ కు పలు సూచనలు చేసారు. ఈ పరిశీలనలో డీఆర్డీఓ గీత, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సంతోష్ కుమార్, సీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ సుమన్ మోహన్ రావు, డిప్యూటీ సీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ కాశీనాథ్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, డీఈ వాణి, డీపీఎం రవీందర్ తదితరులు పాల్గొన్నారు

**టిపిటిఎఫ్ క్యాలెండర్,డైరీ ఆవిష్కరణలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

పదవ తరగతి పరీక్ష ఫలితాలలో రాజన్న సిరిసిల్ల జిల్లా రాష్ట్రంలోనే అత్యుత్తమ స్థానంలో ఉండాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. మంగళవారం టిపిటిఎఫ్ 2026 నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో అందరం కలిసికట్టుగా పనిచేయాలన్నారు. సమగ్ర సర్వే నిర్వహించిన సిబ్బందికి గౌరవ వేతనం రాలేదని కలెక్టర్ కు తెలుపగా జిల్లాకు బడ్జెట్ అలాట్మెంట్ కాగానే సర్వే నిర్వహించిన సిబ్బంది ఖాతాలలో జమ చేస్తామని తెలిపారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కొరకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి చర్చిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టిపి టిఎఫ్ జిల్లా అధ్యక్షులు దుమాల రమనాథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి విక్కుర్తి అంజయ్య, జిల్లా ఉపాధ్యక్షులు మందాడి శ్రీనివాసరెడ్డి, నూగురి దేవేందర్, జిల్లా కార్యదర్శి చకినాల రామచంద్రం, బొజ్జ కృష్ణ, బండి ఉపేందర్, శ్రీనివాస్, చకినాల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణులకు ఎఎన్‌సి చెకప్‌లపై దృష్టి సారించాలి

వీర్నపల్లి పిహెచ్‌సి ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/వీర్నపల్లి:**గర్భిణీలకు ఏఎన్సీ చెకప్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలని, వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఇంచార్జి కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా ఓపీ, వైద్యులు, సిబ్బంది హాజరు రిజిస్టర్ తనిఖీ చేశారు. ఏఎన్సీ నమోదు, ఎన్‌సీడీ స్క్రీనింగ్ టెస్టులపై ఆరా తీశారు. వ్యాక్సిన్ గది, ల్యాబ్, ఫార్మసీలను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. అలాగే ప్రభుత్వ వైద్యశాలల్లోనే ప్రసవాలు, చికిత్స పొందేలా వైద్య సిబ్బంది క్షేత్ర స్థాయిలో గర్భిణీ స్త్రీల ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు, పరిసరాల పరిశుభ్రతపై వివరించి అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.

## సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన...

**ప్రజాపక్షం/వీర్నపల్లి:**మండల కేంద్రంలోని మద్దిమల్ల గ్రామంలో సబ్ స్టేషన్ నిర్మాణంకు అనువైన స్థలాన్ని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు మంగళవారం పరిశీలించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు శాలువ కప్పి సత్కరించారు. వారి వెంట సెస్ డైరెక్టర్ మాడ్గుల మల్లేశం, సర్పంచ్‌లు రవి, కృష్ణ, ఉప సర్పంచ్ కుమార్, అనిల్, ఏడి శ్రీనివాస్, ఏఇ రమేష్, మాజీ సర్పంచ్ సుదర్శన్, మాజీ ఉపసర్పంచ్ రవి, మండల నాయకులు, అధికారులు ఉన్నారు.

## వీర్నపల్లి ప్రీమియర్ లీగ్-5 క్రికెట్ టోర్నమెంట్...

**ప్రజాపక్షం/వీర్నపల్లి:**మండల కేంద్రంలో సర్పంచ్ మల్లారపు జోత్స్న ఆరుణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వీర్నపల్లి ప్రీమియర్ లీగ్5 క్రికెట్ టోర్నమెంటు మంగళవారం ముగిసింది. పోటీల్లో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి దేవ్ లేవన్‌కు 10వేల సీల్డ్, ద్వితీయ బహుమతి సూపర్ లెవల్‌కు 5 వేలు సీల్డ్‌ను ఎంపీడీఓ శ్రీలేఖ, సర్పంచ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటల్లో గెలుపు ఓటములు సహజం అని, ఆటలతో పాటు చదువులో కూడా రాణించాలని కోరారు. కార్యక్రమంలో వన్‌పల్లి సర్పంచ్ తడగొండ సాయిలు, భాగ్యలక్ష్మి పర్శరాములు, నీల బాయి సంగు, భగవంతం, సంజీవ్, గోరెమియ, మండల కాంగ్రెస్ యూత్ అధ్యక్షులు తిరుపతి యాదవ్, నాయకులు నవీన్, నాగరాజు, అజయ్, శంకర్, మధు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## సీట్ బెల్ట్ ధరించి వాహనాలు నడపొద్దు

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ఫోర్ వీలర్ వాహనం నడిపేటప్పుడు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, వాహనాల కండిషన్ ఎప్పటికప్పుడు చూసుకోవాలని రాజన్న సిరిసిల్ల జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్ సూచించారు. మంగళవారం రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని తంగళ్ళపల్లి మండలం లోని బద్దెనపల్లి లో గల ఇంటర్నేషనల్ డ్రైవింగ్ స్కూల్ లో ఆటో రిక్షా డ్రైవర్లకు, టాక్సీ క్యాబ్ డ్రైవర్లకు,సరుకు రవాణా డ్రైవర్లకు, ప్రమాద రహిత డ్రైవింగ్ ఎలా చేయాలో వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఆటో రిక్షాలు నడుపు సమయంలో డ్రైవర్ సీట్ కు ముందు ప్రయాణికులను కూర్చో పెట్టొద్దని, ముందు అద్దముకు ఎలాంటి స్టిక్కర్లు అంటించకూడదని సూచించారు. ద్విచక్ర వాహనాలు నడుపు వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి హెల్మెట్ లాక్ చేయాలన్నారు. వాహనాలకు సంబంధించి అన్ని పత్రాలు డ్రైవింగ్ లైసెన్స్ వ్యాలీడ్ ఉండేలా చూసుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడుపద్దని సూచించారు. ఫోన్లు మాట్లాడుతూ వాహనం నడుపద్దని వాహనం నడుపు సమయంలో వాహనానికి వాహనానికి మధ్య కనీసం 50 ఫీట్లు దూరం ఉండేలా జాగ్రత్త పడాలన్నారు. ఐటీడీర్ ప్రిన్సిపాల్ దొరయ్ మురుగన్, సహాయక మోటార్ వాహన తనిఖీ అధికారి రజిని, పృథ్వీరాజ్ వర్మ, సిబ్బంది సౌమ్య, రమ్య, ప్రశాంత్, ఎల్లయ్య పాల్గొన్నారు.

## ముగ్గుల పోటీలు...

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:**మండలంలోని గొల్లపల్లి గ్రామంలో గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 26 మంది మహిళలు పాల్గొనగా గెలుపొందిన వారికి సర్పంచ్ కొండ రమేష్ గౌడ్ చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు. మొదటి బహుమతి దాసరి నాగరాణికి గొర్రె మల్లేష్ యాదవ్ మిక్సిగ్రైండర్, రెండవ బహుమతి చేపూరి శివానికి రామచంద్రం రైస్ కుక్కర్, మూడవ బహుమతి చేపూరి వెన్నెలకి పాశం పావని హరిష్ డిన్నర్ సెట్ అందించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మణెమ్మ, దాసరపు సంగీత, పద్మ, అరుణజ్యోతి, పరశురాములుగౌడ్, లావణ్య, దేవరాజు, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, బిల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మండల నాయకులు, మహిళా సంఘాలు, యువజన సంఘాలు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## వెంకటాపూర్ గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్




**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:**మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో బిజేపి నాయకులు క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ప్రారంభించారు. మానసికి ఉల్లాసానికి ఆరోగ్యానికి ఆటలు ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుంటాయని రాజన్న సిరిసిల్ల జిల్లా బిజేపి కారదర్శి పోన్నాల తిరుపతి రెడ్డి సర్పంచ్ మెడిశెట్టి పద్మ బాలయ్య అన్నారు. అనంతరం విజేతలకు బహుమతుల ప్రధానం చేస్తూ మాట్లాడారు. మొదటి బహుమతి 10116 రూ॥ సర్పంచ్ మేడిశెట్టి పద్మాబాలయ్య, ద్వితీయ బహుమతి 5016 రూ॥ గొట్టే శ్రీకాంత్, పోన్నాల తిరుపతి రెడ్డి బ్యాట్స్, పీర్ బాబా పరశురాములు గౌడ్ కప్స్ బహుమతులు అందించారు. కార్యక్రమంలో గుర్రాల రాజి రెడ్డి, గడ్డం రవి, మల్లారపు మహేష్, పోన్నాల సాయి తదితరులు ఉన్నారు.

## గ్రామీణ క్రీడల్లో యువకులు రాణించాలి

సర్పంచ్ బొంతల అన్నపూర్ణ ఉపేందర్



**ప్రజాపక్షం/ముత్తారం :**గ్రామీణ క్రీడల్లో యువత రాణించాలని సర్పంచ్ బొంతల అన్నపూర్ణ ఉపేందర్ అన్నారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని అడవిశ్రీరాంపూర్ గ్రామంలో యువతను క్రీడల వైపు ప్రోత్సహించేందుకు మోత్కురి మహేష్ ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ తోపాటు ఉప సర్పంచ్ హరిత తిరుపతి తోపాటు వార్డు సభ్యులు హాజరై క్రీడలు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ టోర్నమెంట్ ద్వారా గ్రామ యువతలో క్రీడాస్ఫూర్తి పెరగడం, శారీరక దృఢత్వం, ఐక్యత, క్రమశిక్షణ వంటి విలువలు పెంపొందించడమే మా ప్రధాన లక్ష్యమని క్రీడల్లో పాల్గొన్న ప్రతి ఆటగాడికి మా అభినందనలు తెలుపుతూ విజయం సాధించిన జట్లకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ పెద్దలు, యువత, స్వచ్ఛంద సేవకులు అందరూ కలిసి సహకరించడంతో ఈ టోర్నమెంట్ విజయవంతంగా పూర్తయ్యింది.గ్రామ యువత క్రీడల్లో ముందుండి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. సర్పంచ్ అన్నపూర్ణఉపేందర్, ఉపసర్పంచ్ అనవేన హరితతిరుపతి కాంగ్రెస్ పార్టీ నాయకులు, మైనారిటీ సేల్ వజీద్ పాషా, వార్డు సభ్యులు మద్దెల దివాకర్,సంపత్ స్వామి,అ ంజి, రవి,గ్రామ పెద్దలు నాంసాని సమ్మయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ వార్డు సభ్యుడు అకోజు అశోక్ చారి,బిరుదు గట్టయ్య, కలవేన సదయ్య, లక్కం రాజు, సాద సామి, కోమలత తో పాటు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి : ఎంపిడిఒ



**ప్రజాపక్షం/ముత్తారం :** పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపిడిఒ సురేష్ అన్నారు.మంగళవారం పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామంలో పారిశుధ్యం నిర్వహణపై పలు వీధులనుఎంపిడిఒ సురేష్ ,గ్రామ సర్పంచ్ పోతుపెద్ది కవిత కిషన్, ఉపసర్పంచ్ దాసరి ప్రశాంత్ గౌడ్, గ్రామపంచాయతీ కార్యదర్శి రాజేందర్ తో పాటు వార్డు సభ్యులతో కలిసి ఎంపిడిఒ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో మురికి కాలువలు శుభ్రం చేయడం, చెత్త సేకరణకు ట్రాక్టర్లు ఏర్పాటు చేసి తడిపొడి చెత్త వేరు చేయించడం, దోమల నివారణకు మందు పిచికారీ చేయడం, ప్రజలకు అవగాహన కల్పించడం, సీజనల్ వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం వంటివి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి రాజేందర్, కరోబార్ ప్రభాకర్, ఫీల్డ్ అసిస్టెంట్ సురేష్ తోపాటు గ్రామపంచాయతీ సిబ్బంది ఉన్నారు.

## యూత్ కాంగ్రెస్ నూతన గ్రామకమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం/ముత్తారం :** తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు,టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు,రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి, మంథని డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చీమల సందీప్ ఆదేశాల మేరకు ముత్తారం మండల కేంద్రంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బక్కతట్ల వినీత్,గ్రామ కమిటీ ఎన్నిక ఇంచార్జి బియ్యాని శివ కుమార్ ఆధ్వర్యంలో ముత్తారం యూత్ కాంగ్రెస్ నూతన గ్రామ కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ముత్తారం యూత్ కాంగ్రెస్ నూతన గ్రామ కమిటీఅధ్యక్షులు గా ఆకుల రాము,ఉపాధ్యక్షులు గుడి రాకేష్ కుక్కల లక్ష్మణ్,ప్రధాన కార్యదర్శి తంగేళ్ల దేవేందర్, కార్యదర్శి మేడి శ్రీధర్,కోశాధికారితమ్మిశెట్టి నవీన్,అధికార ప్రతినిధి మేదరి నవీన్,ప్రచార కమిటీ కన్వీనర్ గుడికందుల కుమార్, కార్యవర్గ సభ్యులుగాగుడి కందుల రాకేష్,కలవేన వెంకటేష్,మధురకవి వంశీ,పరుపాటి దేవేందర్ రెడ్డి,పెయ్యాల సాయికిరణ్,గుడి రంజిత్,కుక్కల శ్రీకాంత్,గుడి రమేష్,తేనుకుంట్ల రాకేష్,మంతిని సుధాకర్‌ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్బంగా యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు మాట్లాడుతూ పార్టీని భలోపేతం చేయడానికి ఉత్సహంగా పనిచెయ్యాలని, రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో సైనికుడిలా పనిచేసి పార్టీ గెలుపు కోసం కృషి చెయ్యాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముత్తారంమండల కో ఆర్డినేటర్ అనుము ప్రశాంత్, ముత్తారం గ్రామ శాఖ అధ్యక్షులు అనుము సమ్మయ్య ,మాజీ సర్పంచ్ తూటి రజిత రఫీ,నాయకులు నూనెటి కృష్ణ కుక్కల చంద్రమౌళి, బాలసాని రాజకుమార్, అలుగం సంపత్,యూత్ నాయకుల తో పాటు కారకర్తలు పాల్గొన్నారు.

## ‘ప్రలోభ రహితంగా డి.ఆర్. చెల్లించాలి’

**ప్రజాపక్షం/రామగుండం:** రాష్ట్ర ప్రభుత్వం సోమవారం సర్వీసులో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు డి.ఎ. ప్రకటించింది. అలాగే విశ్రాంత ఉపాధ్యాయులకు డి.ఆర్. ప్రకటించినందున ట్రెజరీ అధికారులు ప్రలోభ రహితంగానే బిల్లులు చేయాలని డిమాండ్ చేస్తూ పెద్దపల్లి జిల్లా అవినీతి నిరోధక వేదిక కార్యకర్తలు కె.ఆనందరావు, బి.వెంకటన ర్సయ్య, ఓ.జనార్ధన్‌లు మంగళవారం రామగుండం తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. సర్వీస్‌లో ఉన్న వారికి వేతన మంజూరు అధికారులు పెరిగిన డి.ఎ.తో వేతన బిల్లులు చేస్తారు. విశ్రాంతులైన వారికి ట్రెజరీ అధికారులే చేయాలి. ఇది సాకుగా చూపి ట్రెజరీ కార్యాలయాల్లో కొందరు అధికారులు, ఉద్యోగులు ప్రలోభ పెడితేనే బిల్లులు చేస్తున్నారని, ఇందుకు విశ్రాంత ఉపాధ్యాయులను మధ్యవర్తులుగా పెడుతున్నారని ఆరోపించారు. విశ్రాంత ఉపాధ్యాయులకు ప్రలోభరహితంగా బిల్లులు చెల్లించేలా చూడాలని డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ హైదరాబాద్‌ను కోరుతూ నాయబ్ తహసీల్దారు బి.లక్ష్మి కి వినతి పత్రం అందజేసినట్లు వారు తెలిపారు.

## మహిళా రైతు కూలీలకు ఉన్ని దుస్తులు అందజేత



**ప్రజాపక్షం/రామగుండం** : రామగుండం పట్టణం హౌసింగ్‌బోర్డుకాలనీ, పాత రామగుండం, పాములపేట గ్రామాలకు చెందిన మహిళా రైతు కూలీలకు ఉచితంగా ఉన్ని దుస్తులను మంగళవారం పంపిణీ చేసినట్లు కాంగ్రెస్ పట్టణ నాయకుడు పల్లికొండ రాజేష్ తెలిపారు. ఉదయం, సాయంత్రం వేళల్లో చలిలో పొలం పనులు చేసేందుకు మహిళలు ఇబ్బంది పడ్తున్నందున ఉన్ని దుస్తులు అందజేసినట్లు రాజేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడి రాజయ్య, బింగి నరేష్, పల్లికొండ రాజేందర్, గున్నాల శ్రీనివాస్, బొద్దుపల్లి మహేందర్‌లు పాల్గొన్నారు.

## అంతర్గాంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు

**ప్రజాపక్షం/అంతర్గాం :** సంక్రాంతి పండుగను పురస్కరించుకొని అంతర్గాం మండల కేంద్రంలో గ్రామ సర్పంచి అంబోతు రవికుమార్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను మంగళవారం నిర్వహించారు. మహిళలు, యువతులు ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొన్నారు. రంగులతో ఆకర్షణీయంగా వేసిన ముగ్గులు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి అంతర్గాం తహసీల్దారు తూము రవీందర్ పటేల్ , ఎంపిడిఓ జి.తిరుపతిలు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఉరిమెట్ల రాజలింగం, కాంగ్రెస్ పార్టీ ఒబిసి సెల్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేష్, ఎంపీవో బైరి వేణుమాధవ్, ఏపీఎం సదానందం, ఉప సరపంచి ఉష, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# మొబైల్‌లో సిఎంపిఫ్ బ్యాలన్స్ చూసుకోవచ్చు



**ప్రజాపక్షం/రామగిరి:**మంగళవారం జి.యం కార్యాలయం నందు రామగుండం3 ఏరియా లోని ఓ.సి1 ఉపరితల గనిలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు వాహనాల డ్రైవర్ల కు వారి సియంపిఎఫ్ బ్యాలన్స్ వివరాలను సి కేర్స్ వెబ్ సైట్ ద్వారా వారి బాలన్స్ వివరాలు వారివారి మొబైల్ ఫోన్ లో చూపించారు అలాగే వారి బ్యాలన్స్ ఎలా చూసుకోవచ్చునో అవగాహన కల్పించారు.వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థ లొనే మొట్ట మొదటిసారిగా రామగుండం3 ఏరియాలో కాంట్రాక్టు డ్రైవర్ల కోసం చేసిన ప్రయత్నం ఫలించినదని అందుకు సహకరించిన అధికారులకు, ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. ఇదే విధంగా అన్ని ఏరియాల్లో చేయడం జరుగుతుందని తెలిపారు. బ్యాలన్స్ చూసుకోవడాని ఇక ముందు పాస్ బుక్ చిట్టీ అవసరం లేకుండా ఎప్పుడైనా వారి,వారి బ్యాలన్స్ అమౌంట్ ఫోన్ లో చూసుకోవచ్చని అన్నారు.కార్యక్రమంలో ఎస్వోటుజియం యం.రామ్మోహన్, పర్సనల్ విభాగపతి సుదర్శనం,డివై పియం సునీల్ ప్రసాద్, ఫైనాన్స్ విభాగం అధికారి భరత్, సిబ్బంది అనిత, కుమార స్వామిపాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు



**ప్రజాపక్షం/రామగిరి:**కల్వచర్ల గ్రామానికి చెందిన కుర్ర రమేష్, లావణ్య గార్ల కుమార్తె కుమారి సహస్ర జ్ఞాపకార్థంగా మంగళవారం రాణి రుద్రమ దేవి స్టేడియంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎరుకల యువత కోసం ఘనంగా నిర్వహించారు. ఆర్గనైజర్లుగా రేవెల్లి మహేష్, సార్ల రమేష్, కుర్ర కుమార్ వ్యవహరించారు.పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా మాజి జెడ్పిటిసి గంట వెంకట రమణారెడ్డి, పన్నూరు సర్పంచ్ చిందం మహేష్, లద్నపూర్ పూర్ సర్పంచ్ వనం రామచంద్రరావు, లయన్స్ క్లబ్ అధ్యక్షులు మేకల మారుతి యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు కుటుంబ సభ్యులతో కలిసి కుమారి సహస్ర చిత్రపటానికి నివాళుల ర్పించి కబడ్డీ పోటీలను ప్రారంభించారు.ఈ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో విజయం సాధించిన మొదటి జట్టు కల్వచర్ల టీమ్ కి రూ.15,000 నగదు, రెండో జట్టు జమ్మికుంట టీమ్ కి రూ.10,000 నగదు బహుమతితో పాటు మెమెంటోలు అందజేశారు.అనంతరం మాట్లాడుతూ ఈ రోజుల్లో కొన్నిచోట్ల ఆడబిడ్డ పుట్టిందనే కారణంతోనే అమానుష ఘటనలు చోటు చేసుకుంటున్న దుర్మార్గమైన పరిస్థితులు మన కళ్ల ముందే కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి కాలంలో తన కుమార్తె సహస్ర జ్ఞాపకార్థంగా తండ్రి రమేష్ ఈ విధంగా రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించడం సమాజానికి ఒక గొప్ప సందేశమని తెలిపారు.ఆడపిల్లపై గౌరవం, ప్రేమ, బాధ్యతను చాటేలా ఈ కార్యక్రమం నిలిచిందని, కుమారి సహస్ర జ్ఞాపకాన్ని క్రీడల ద్వారా చిరస్థాయిగా నిలిపిన రమేష్‌ను పలువురు అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో ఆడబిడ్డ విలువను చాటుతాయని వక్తలు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని పోటీలను విజయవంతం చేశారు.

# కార్యకర్త కుటుంబానికి అండగా ఎమ్మెల్యే

స్వంతంగా రూ.3 లక్షలు, ప్రభుత్వం తరపున రూ. లక్ష సాయం✲ కష్టపడే కార్యకర్తను కాపాడుకుంటామన్న ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/గంగాధర:**రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కుటుంబానికి అండగా నిలిచి తన గొప్ప మనసును చాటుకున్నాడు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం. గంగాధర మండలం ర్యాలపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త గరిగంటి కరుణాకర్ నెల రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. గతంలోనే బాధిత కుటుంబాని పరామర్శించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కరుణాకర్ కుటుంబానికి అండగా ఉండి ఆదుకుంటామని భరోసా కల్పించారు. ఇచ్చిన మాట ప్రకారం మంగళవారం కరుణాకర్ ఇంటికి వెళ్లి రూ.3 లక్షలు, ప్రభుత్వం తరపున ఒక లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. భవిష్యత్తులో ఏ కష్టం వచ్చినా అండగా ఉండి ఆదుకుంటామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తను కడుపులో పెట్టి కాపాడుకుంటామని స్పష్టం చేశారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా పెద్దన్నలా అండగా ఉండి ఆదుకుంటామని పేర్కొన్నారు. కాగా కరుణాకర్ కుటుంబానికి అండగా ఉండి ఆదుకున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు చొప్పదండి నియోజకవర్గం ప్రజల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అంబటి రజిత, సింగిల్ విండో మాజీ చైర్మన్ వెలిచాల తిరుమల్ రావు, పుల్కం నర్సయ్య, సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షుడు ముద్దం నగేష్, స్థానిక సర్పంచ్ దాసె అనసూర్య ఓదేలు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, సాగి అజయ్ రావు, అట్ల శేఖర్‌రెడ్డి, పడాల రాజన్న, ఈటవెణి శ్రీనివాస్, వేముల భాస్కర్, గునుకొండ బాబు, బూరుగు గంగన్న, అట్ల రాజిరెడ్డి, మంత్రి మహేందర్ తదితరులున్నారు.

## పల్లెల్లో ‘విద్యుత్తు ప్రజాబాట’




**ప్రజాపక్షం/అంతర్గాం :** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలంలోని టిటిఎస్ అంతర్గాం, కుందనపల్లి గ్రామాల్లో విద్యుత్తు ప్రజాబాట కార్యక్రమాన్ని అధికారులు మంగళవారం నిర్వహించారు. ఎన్పీడీసీఎల్ అధికారులు, సిబ్బంది గ్రామస్తులతో కలిసి గ్రామంలో పర్యటించారు. క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలను గుర్తించి నమోదు చేసుకున్నారు. వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కాగా, ఎన్పీడీసీఎల్ అంతర్గాం మండల ఎ.ఈ. శంకర్‌ను టిటిఎస్ అంతర్గాంలో సర్పంచి అంబోతు రవికుమార్, ఉప సర్పంచి ఉష ఆధ్వర్యంలో శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కుందనపల్లి ఉప సర్పంచి మేకల విద్య అశోక్, ఆయా గ్రామాల వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య రహిత గ్రామంగా తీర్చిదిద్దుతాం: సర్పంచ్

**ప్రజాపక్షం/ముత్తారం:** పారిశుద్ధ్య రహిత గ్రామంగా తీర్చిదిద్దుతామని సర్పంచ్ జ్యోతిలక్ష్మణ్ అన్నారు. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని మచ్చుపేట గ్రామంలోని పలు వీధుల్లో గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ సిబ్బందిచే డ్రైనేజీ కాలువలను పూడికతీత పనులు చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యంగా, అందంగా మార్చడానికి మురికినీటి కాలువలు శుభ్రం చేయడం, తడిపొడి చెత్త వేరు చేసి డంపింగ్‌కు తరలించడం, దోమల నివారణకు ఫాగింగ్ చేయడం, తాగునీటిని శుభ్రపరచడం వంటి పనుల ద్వారా సాధించవచ్చునని అన్నారు.ఇది ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు, ప్రజలందరి భాగస్వామ్యంతో జరిగే ఒక ముఖ్యమైన లక్ష్యంగా దీనికి ప్రజలందరూ పార్టీలకు అతీతంగా సహకరించాలని సర్పంచ్ కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాకేష్,వార్డు గ్రామపంచాయతీ కార్యదర్శి తోపాటు గ్రామపంచాయతీ సిబ్బంది ఉన్నారు.

## రహదారి పక్కన ఉన్న పిచ్చి మొక్కల తొలగింపు

**ప్రజాపక్షం/ముత్తారం** :పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్ నుండి ఓడేడు గ్రామానికి వచ్చే ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను గ్రామ సర్పంచ్ పోతుపెద్ది కవిత కిషన్ రెడ్డి, ఉప సర్పంచ్ దాసరి ప్రశాంత్ గౌడ్, గ్రామపంచాయతీ కార్యదర్శి రాజేందర్ తో పాటు వార్డు సభ్యుల ఆధ్వర్యంలోఓడేదు గ్రామంలోని ఎస్సీ కాలనీ వెళ్లేదారిలోని మార్గ మధ్యలో ముళ్ళ పొదలతో ప్రయాణికులకు చాలా ఇబ్బంది కలగడం వల్ల సర్పంచ్ పోతుపెద్ది కవిత కిషన్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని ముళ్ళ పొదలను పూర్తిస్థాయిలో తీసేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పోతిపెద్ది కవిత కిషన్ రెడ్డి,ఉప సర్పంచ్ దాసరి ప్రశాంత్ గౌడ్,కార్యదర్శి బుర్ర రాజేందర్,కారోబార్ అక్కపాక ప్రభాకర్,ఫీల్డ్ అసిస్టెంట్ రత్న సురేష్,వార్డు సభ్యులు తోపాటు గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## భద్రత నియమాలను తప్పక పాటించాలి: ఎస్ఐ

**ప్రజాపక్షం/ముత్తారం:** రహదారి భద్రత నియమాలను వాహనదారులు,ప్రజలు తప్పక పాటించాలని ముత్తారం ఎస్సై రవికుమార్ అన్నారు.మంగళవారం పెద్దపెల్లి జిల్లా ముత్తారం మండలంలోని మచ్చుపేట, ఓడేడ్ గ్రామాల్లో మంగళవారం ముత్తారం ఎస్సై ఆధ్వర్యంలో రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వేగ పరిమితులు పాటించడం, ట్రాఫిక్ సిగ్నల్స్, సైన్ బోర్డులు అనుసరించడం, డ్రైవింగ్ చేస్తున్నప్పుడు మొబైల్ వాడకం, తాగి నడపడం వంటివి మానుకోవడం, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం, సురక్షిత దూరం పాటించడం తో పాటు వాహనదారులు వాహనం అన్ని డాకుమెంట్స్ కలిగి ఉండాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించే విధంగా చూడాలని, హెల్మెట్ ధరించడం వలన కలిగే ప్రయోజనాలను, ప్రమాదాలు జరిగినప్పటికీ స్వల్ప గాయాలతో ఎలా ప్రాణాలతో భయటపడవచ్చునో ద్విచక్ర వాహనదారులకు వివరించాలన్నారు. ప్రమాదాలను నియంత్రించుటలో భాగంగా విస్తృతంగా డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేసి కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ముత్తారం ఎస్సై రవికుమార్, ఏఎస్ఐలు,ఆయా గ్రామాల సర్పంచులు తో పాటు పోలీస్ సిబ్బంది,గ్రామస్తులు ఉన్నారు.

## చేతి పంపుల మరమ్మతులు చేయించిన సర్పంచ్



**ప్రజాపక్షం/ముత్తారం:** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలోని అంగన్వాడి కేంద్రంలో ఉన్న చేతి పంపులు మరమ్మతులు చేపట్టారు. చేతి పంపులు పనిచేయక అంగన్వాడి కేంద్రానికి వచ్చే గర్భవతులు, బాలింతలు, చిన్నారులు తాగునీటి కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారని అంగన్వాడి టీచర్ సత్యవతి స్థానిక సర్పంచ్ సూదాటి రవీందర్ రావు దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించిన సర్పంచ్ రవీందర్ రావు చేతి పంపును బాగుచేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి తోపాటు వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది ఉన్నారు.

## జాతీయ అవార్డు పురస్కారాన్ని అందుకున్న గాలిపెల్లి కుమార్

**ప్రజాపక్షం/కొత్తపల్లి:**ఇప్పటివరకు 54 సార్లు రక్తదానం చేయడమే కాకుండా ఆపదలో రక్తం అవసరమున్నవారికి సకాలంలో స్పందించి రక్తాన్ని ఏర్పాటు చేయడంలో కృషి చేసిన కరీంనగర్ జిల్లా బొమ్మకల్‌కు చెందిన గాలిపెల్లి కుమార్ జాతీయ అవార్డు పురస్కారం అందుకున్నారు. స్వామి వివేకానంద జయంతి సంధర్బంగా కామారెడ్డి రక్తదాతల సమూహం, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆద్వర్యంలో జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పుల శ్రీనివాస్ గుప్తా చేతుల మీదుగా అవార్డును అందజేశారు. గాలిపెల్లి కుమార్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ రక్తాన్ని అందేలా చూసి ప్రాణాలను కాపాడతానన్నారు. యువతలో మరింత అవగాహన తీసుకువచ్చేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఐవిఎఫ్ సేవాదళ్, రాష్ట్ర చైర్మన్ డా.బాలు, కామారెడ్డి రక్తదాతల సమూహ అధ్యక్షుడు జమీల్ హైమద్, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ వేద ప్రకాష్‌లు, పరుశవెంకటరమణ, గంప ప్రసాద్ తదితరులు పాల్గొని గాలిపెల్లి కుమార్‌ను అభినందించారు.

## వాటర్‌ప్లాంట్ ప్రారంభించిన ప్రణవ్ బాబు

**ప్రజాపక్షం/వీణవంక:**వీణవంక మండలం కిష్టంపేట గ్రామంలో గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆద్వర్యంలో నూతనంగా నిర్మించిన వాటర్‌ప్లాంట్‌ను హుజురాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్‌బాబు మంగళవారం ప్రారంభించారు. ఈ సంధర్బంగా పాలకవర్గాన్ని అభినందించి ఇదే స్పీడ్‌ను రానున్న రోజుల్లోనూ కొనసాగించాలని, భవిష్యత్తులో గ్రామానికి అన్నివిధాలా అండగా ఉంటామని అన్నారు. ఒక కేంద్ర మంత్రి, ఒక ఎంపి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే ముగ్గురు ఒక్కటైనా హుజురాబాద్ స్థానిక పోరులో కాంగ్రెస్ విజయాన్ని ఆపలేకపోయారని అన్నారు. ఇదే ఉత్సాహాన్ని రానున్న మున్సిపల్ ఎన్నికల్లో చూపిస్తామని, జమ్మికుంట, హుజురాబాద్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేయబోతున్నామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మండల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు నిర్మాణానికి సుడాచైర్మన్ శంకుస్థాపన



**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:**సీతారాంపూర్ 23వ డివిజన్‌లో రూ.22 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సంధర్బంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో మున్సిపల్ కార్పోరేషన్‌లో విలీనమైన ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తున్నామని, ప్రణాళిక బద్దంగా అభివృద్ధిచేసే బాధ్యత తమపై ఉందన్నారు.

# ఓటర్ లిస్ట్‌ను మార్చిన వ్యక్తులపై క్రిమినల్ కేసు నమోదు

### కరీంనగర్ ఎమ్మెల్యేగంగుల కమలాకర్

**ప్రజాపక్షం/కరీంనగర్:**రాత్రికి రాత్రే ఓటర్ లిస్ట్ ను మార్చిన వ్యక్తులను గుర్తించి వారిపై క్రిమినల్ కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడంతోపాటు సరియైన ఓటర్ లిస్టును ప్రకటించాలని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కలెక్టర్ పమేల సత్పతిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటర్ లిస్టు నిన్నటి రోజున రాత్రికి రాత్రే మార్చారని, కేవలం ఇది బడుగు బలహీన వర్గాల రిజర్వేషన్లు వారికి దక్కకుండా చేసిన కుట్రలో భాగంగానే జరిగిందన్నారు. బిఆర్ఎస్ పార్టీ అంటే కాంగ్రెస్, బిజెపికి వణుకు పుడుతుందన్నారు. తప్పుల తడకగా ఉన్న ఓటరు జాబితా పై రెండు పార్టీలు స్పందించకపోవడం పట్ల వారి ఉద్దేశం ఏంటని ప్రశ్నించారు. ఎమ్మెల్యే ఇంటి ఓటర్ లిస్ట్‌ను తాము నివసిస్తున్న డివిజన్ కాకుండా వేరే డివిజన్ కు మార్చడం పట్ల ఎవరి హస్తముందో తేల్చాలని డిమాండ్ చేశారు. ఒక ఎమ్మెల్యేకి ఇలా జరిగితే మిగతా సాధారణ ప్రజల పరిస్థితి ఏమిటని అధికారులను నిలదీశారు. ఈ వ్యవహారంపై తక్షణమే సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. రేపటి వరకు బాధ్యులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని.. మరల సరియగు ఓటర్ లిస్ట్ ప్రకటించాలని లేనిచో ఎన్నికల కమిషన్ కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఎమ్మెల్యే గంగులతో పాటు బిఆర్ఎస్ పార్టీ నగర శాఖ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, మాజీ కార్పొరేటర్లు బిఆర్ఎస్ నాయకులుతదితరులు పాల్గొన్నారు.

## ఐద్వా 14వ జాతీయ మహాసభలు

**ప్రజాపక్షం/కరీంనగర్:**అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 14వ జాతీయ మహాసభలు ఈ నెల 25 నుండి 28 వరకు హైదరాబాదులోని ఆర్టీసీ కళ్యాణ మండపంలో వైభవంగా జరుగనున్నాయి. ఈ సందర్భంగా 25వ తేదీన హైదరాబాదు నగరంలోని ఎన్టీఆర్ గార్డెన్స్ ప్రాంగణంలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కోఠి రాంపూర్ ముకుంద లాల్ మిశ్రా భవన్ లో జాతీయ మహాసభల సందర్భంగా ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం పోస్టర్ ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహిళల హక్కుల రక్షణ, సంక్షేమం, భద్రత, గౌరవం కోసం ఐద్వా నిరంతరం మిలిటెంట్ పోరాటాలను నడిపింది. పసిపిల్లల నుండి వృద్ధుల వరకు మహిళలపై జరుగు దాడులు, దౌర్జన్యాలు, అత్యాచారాలు, వేధింపులపై రాజీ లేకుండా పోరాడింది అని తెలిపారు. ప్రభుత్వాలు మహిళలను రెండవ పౌరురాలిగా చూస్తున్న పరిస్థితిని తీవ్రంగా ఖండించిన కోనేటి నాగమణి మాట్లాడుతూ, స్త్రీపురుషులు సమానులే కానీ పాలక వర్గాలు మత భావాలను రెచ్చగొట్టి మహిళలను వంటింటికే పరిమితం చేయడానికి ప్రయత్నిస్తున్నాయి. ఆ మనుస్మృతి మైండ్సెట్‌ను విసర్జించాలి అన్నారు. 25వ తేదీ బహిరంగ సభకు వేలాదిగా తరలివచ్చి ఐక్యతను ప్రదర్శించండి కోనేటి నాగమణి మహిళలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యురాలు డి.స్వరూప, ఈ.రజిత, టౌన్ ప్రధాన కార్యదర్శి చేని రోజా, జిల్లా నాయకురాలు యమునా రజిని, రాజమణి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

## చలిమెడ రాజేశ్వర్‌రావుకు అత్యుత్తమ డెయిరీ ప్రొఫెషనల్ అవార్డు

**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:**భారతీయ డెయిరీ సంఘం( ఐడిఏ) దక్షిణ మండలి 2026కు గాను అత్యుత్తమ డెయిరీ ప్రొఫెషనల్ అవార్డు2025 (తెలంగాణ) రాష్ట్ర స్థాయి పురస్కారాన్న కరీంనగర్ మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ చైర్మన్ చలిమెడ రాజేశ్వర్‌రావు దక్కించుకున్నారు. గ్రామీణాభివృద్ధి, సహకార డెయిరీ ఉద్యమం, పాలు ఉత్పత్తి, పాల రైతుల జీవన ప్రమాణాల పెంపు కోసం రాజేశ్వర్‌రావు చేసిన నాలుగు దశాబ్దాల సేవలకు గుర్తింపుగా ఈ ప్రతిష్టాత్మక అవార్డును ప్రధానం చేస్తున్నట్లు ఇండియన్ డెయిరీ అసోసియేషన్ ప్రకటించింది. ఈ నెల 8,9,10 తేదీలలో నిర్వహించిన సదరన్ డెయిరీ, ఫుడ్ కాంక్లేవ్ 2026 ప్రోగ్రామ్‌ను వర్గీస్ కురియన్ జన్మస్థలం కేరళ రాష్ట్రం కోజికోడ్‌లోని కాలికట్ ట్రేడ్ సెంటర్‌లో ఆ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి జె.చించురాణి చేతుల మీదుగా పురస్కారాన్ని అందజేశారు. అదే విధంగా ఐడిఏ తెలంగాణ చాప్టర్ పరిధిలో బెస్ట్ ఉమెన్ డెయిరీ ఫార్మర్ అవార్డును కరీంనగర్ డెయిరీ ఎంపిఐ సంగంపల్లి, జగిత్యాల జిల్లా పాల ఉత్పత్తిదారులైన అంకతి రాధ ఎంపికైనందుకు రూ.20 వేల చెక్కు, అవార్డు అందజేశారు. ఈ మేరకు కరీంనగర్ డెయిరీ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చైర్మన్ రాజేశ్వర్ రావు మాట్లాడారు. ఈ అవార్డు వ్యక్తిగతంగా దక్కిన గౌరవం కాదని, కరీంనగర్ డెయిరీతో అనుబంధమున్న లక్షలాది పాడి రైతు కుటుంబాల శ్రమకు, నిబద్ధతకు లభించిన గుర్తింపుగా భావిస్తున్నానని తెలిపారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా, పారదర్శక పాలనతో ముందుకు సాగితే అభివృద్ధి సాధ్యమన్నారు. పాడి రైతుల ఆదాయం పెంచడమే ప్రధాన లక్ష్యమన్నారు. రైతు కుటుంబాలకు సంక్షేమ పథకాలు మరింత విస్తరిస్తామన్నారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.శంకర్‌రెడ్డి, పాల ఉత్పత్తిదారుల కుటుంబ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు. అంతకు ముందు కరీంనగర్ డెయిరీలో ప్రతి సంవత్సరం మాదిరిగా పాడి రైతు కుటుంబాలకు చెందన మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. అదే విధంగా అత్యధిక పాలసేకరణ చేసిన ఎంపిఐ సుందరగిరి, ఎంపిఐ గంభీరావుపేట, ఎంపిఐ నవాబుపేటకు, ఎంసిసి, బిఎంసియు స్థాయిలో అత్యధిక పాలసేకరణ చేసిన వారికి ప్రఋథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఉత్పత్తిదారుల పిల్లలైన ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన విజేతలకు నగదు పారితోషికం అందించారు.

# మెరుగైన విద్యుత్ సరఫరాకు ప్రజాబాట

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** వినియోగదారులకు అంతరాయం లేని నిరంతరం విద్యుత్ సరఫరా చేయడంతో పాటు విద్యుత్ వినియోగంలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ప్రజా బాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఏడిఈ వరుణ్ కుమార్,ఏ ఈ రాకేష్ కుమార్ అన్నారు.మంగళవారం జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని శ్రీరాములపల్లి ,రాపల్లి గ్రామాల్లో విద్యుత్ అధికారులు ప్రజా బాట కార్యక్రమాన్ని నిర్వహించారు .కార్యక్రమంలో భాగంగా విద్యుత్ సమస్యలు ఎదురైతే వినియోగదారులు సంబంధిత అధికారులను ఉద్యోగులను సంప్రదించడం ఫిర్యాదు చేయడం వంటి అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.గ్రామాల్లోని విద్యుత్ సరఫరా పరిస్థితులను సమీక్షించి,ప్రజల నుండి విద్యుత్ సంబంధిత సమస్యలు, ఫిర్యాదులను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు.విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన భద్రతా జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. విద్యుత్ తీగలకు దగ్గరగా నిర్మాణాలు చేపట్టవద్దని, పాత వైర్లు, దెబ్బతిన్న స్తంభాలు, లూజ్ కనెక్షన్లు ఉంటే వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు తెలియజేయాలని సూచించారు.అలాగే గ్రామాల్లో దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను గుర్తించి వాటిని వెంటనే మరమ్మత్తులు చేసి అవసరమైతే కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రజా బాట కార్యక్రమం ద్వారా గ్రామస్తుల సమస్యలకు త్వరితగతిన పరిష్కారాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు భరోసా ఇచ్చారు.శ్రీరాములపల్లి సర్పంచ్ సల్లూరి శోభన్ ,ఉప సర్పంచ్ ,రాపల్లి సర్పంచ్ ,ఉప సర్పంచ్ నల్ల పృథ్వీరాజ్ , ఏడిఈ వరుణ్ కుమార్ ,ఎఇ,విద్యుత్ సిబ్బంది, వార్డు సభ్యులు,ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

## ఆరు నెలలకోసారి ఆరోగ్య మహిళ పరీక్షలు తప్పనిసరి

### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**ప్రజాపక్షం/కరీంనగర్:**మహిళలకు ఆరు నెలలకు ఒకసారి ఆరోగ్య మహిళ వైద్య పరీక్షలు తప్పనిసరిగా చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. రేకుర్తిలోని పల్లె దవాఖానాను జిల్లా కలెక్టర్ మంగళవారం సందర్శించారు. ఈ దవాఖానాలో నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా వైద్య పరీక్షలను పరిశీలించారు. పలువురు మహిళలకు బీపీ పరీక్ష చేయించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి మహిళ ఆరోగ్య మహిళా వైద్య పరీక్షలు చేయించుకునేలా వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని అన్నారు. ఆరు నెలల తర్వాత రెండవ దఫా వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. బిపి,, షుగర్ వ్యాధి ఉన్నవారికి పల్లె దవాఖానా నుంచి ప్రతి నెలా మందులు అందజేయాలని తెలిపారు. రక్తహీనత ఉన్న వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారికి ఐరన్, క్యాల్షియం వంటి మాత్రలు అందజేయాలని, ఐరన్ సమకూరే ఆహారాన్ని సూచించాలని తెలిపారు. గర్భిణీలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నాలుగు ఏఎన్ సి పరీక్షలు చేయించాలని, ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవానికి అవగాహన కల్పించాలని అన్నారు. బాలింతలకు బలవర్ధకమైన ఆహారం సూచించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, ప్రోగ్రాం ఆఫీసర్ సనా, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**జాతీయ, సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌కి ఎంపికైన విద్యార్థినిని అభినందించిన కలెక్టర్**

రాజ్య స్థరీయ బాల వైజ్ఞానిక ప్రదర్శనలో తన ప్రతిభను చాటి రాష్ట్రంలోనే మొదటి స్థానాన్ని సాధించి జాతీయ, సౌత్ ఇండియా సైన్స్ ఫయిర్ కి ఎంపికైన ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని ఎస్.అర్చనను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అభినందించారు. ఈనెల 7 నుండి 9 వరకు కామారెడ్డిలో జరిగిన రాష్ట్రస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శనలో మల్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్.అర్చన రీ క్రియేషనల్ మ్యాథమెటికల్ మోడలింగ్ అనే థీమ్ పై మల్టీ టాస్కింగ్ మాథ్స్ మోడల్ అనే అంశంపై ప్రాజెక్టు ప్రదర్శించారు. ఈ ప్రాజెక్టు రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానానికి ఎంపిక కాగా అర్చన ఈనెల 18న జరిగే సౌత్ ఇండియా సైన్స్ ఫయిర్ లో, త్వరలో జరగబోయే జాతీయ సైన్స్ ఫయిర్ లో పాల్గొననున్నారు. అర్చనను జిల్లా విద్యాధికారి అశ్విని తానాజీ వాకడే అభినందించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి జయపాల్ రెడ్డి, విద్యా శాఖ కోఆర్డినేటర్లు అశోక్ రెడ్డి, మిల్కూరి శ్రీనివాస్, ఎంఈఓ ఆనందం, గైడ్ టీచర్ కే.స్వాతి, ప్రధానోపాధ్యాయుడు బి.భీమేష్ పాల్గొన్నారు.

**జపాన్ పర్యటనకు విద్యార్థిని అభినంధించిన్ల కలెక్టర్**

సకురా సైన్స్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటిన ఎలగందల్ మోడల్ స్కూల్ విద్యార్థిని గుర్రాల శివాంజలిని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అభినందించారు. తెలంగాణ మోడల్ స్కూల్ ఎలగందల్ లో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న శివాంజలి రాత పరీక్ష, స్క్రీన్ టెస్ట్ ద్వారా ఈ పర్యటనకు ఎంపికయ్యారు. రాష్ట్రం నుండి నలుగురు మాత్రమే ఈ పర్యటనకు ఎంపికవగా అందులో జిల్లాకు చెందిన శివాంజలి ఉండడం విశేషం. మే 24 నుండి 30 వరకు జపాన్ పర్యటించి అక్కడి పరిశ్రమలు, పరిశోధన సంస్థలను సందర్శిస్తారు. శివాంజలిని జిల్లా విద్యాధికారి అశ్విని తానాజీ వాకడే అభినందించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి జయపాల్ రెడ్డి, విద్యాశాఖ కోఆర్డినేటర్లు అశోక్ రెడ్డి, మిల్కూరి శ్రీనివాస్, ఎంఈఓ ఆనందం, ప్రిన్సిపాల్ కొడిమ్యాల శ్రీనివాస్, తల్లిదండ్రులు కరుణాకర్, శారద పాల్గొన్నారు.

## కుందనపల్లిలో 'గోపాలమిత్ర' ప్రారంభం




**ప్రజాపక్షం/అంతర్గాం :** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం కుందనపల్లి గ్రామంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో గోపాలమిత్ర ఉచిత వైద్య శిబిరాన్ని సర్పంచి అర్కుటి కొమురయ్య యాదవ్, ఉప సర్పంచి మేకల విద్య అశోక్ మంగళవారం ప్రారంభించారు. రైతులు పశువులను తీసుకురాగా వాటికి వైద్య పరీక్షలు జరిపి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్, సిబ్బంది, వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

# ఊరికి వెళ్లేవారు జాగ్రత్తలు పాటించాలి

కాగజ్‌నగర్ డీఎస్‌పి వాహిదుద్దీన్



**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** సంక్రాంతి సెలవుల్లో ఊరికి వెళ్లే ప్రజలు ఇళ్ల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కాగజ్‌నగర్ డిఎస్‌పి వాహిదుద్దీన్ సూచించారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్‌పి నితిక పంత్ ఆదేశాల మేరకు మంగళవారం పట్ట ణంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆటో ద్వారా అవగా హన ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సంద ర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ పండుగ వేళ ప్రజలు తమ స్వగ్రామాలకు వెళ్లేటప్పుడు ఇళ్లకు తాళాలు వేసి వెళ్లే క్రమంలో అప్రమత్తంగా ఉండాలని, దొంగతనాలు జరగకుండా ముందుస్తు జాగ్రత్తలు పాటించడం తప్ప నిసరి అని పేర్కొన్నారు. ప్రయాణానికి వెళ్లే వారు తమ వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్‌లో నమోదు చేయా లని, ఇళ్లకు పటిష్టమైన తాళాలు వేయాలని, విలువైన నగదు, బంగారం ఇంట్లో ఉంచకుండా బ్యాంక్ లాక ర్లలో భద్రపరచుకోవాలని సూచించారు. పొరుగువా రికి తమ ప్రయాణ వివరాలు తెలియజేయాలని, అవస రమైతే పోలీసులకు సమాచారం ఇవ్వడం ద్వారా భద్రత పొందవచ్చని చెప్పారు. కాలనీల్లో అనుమానా స్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో కాగజ్ నగర్ టౌన్ సిఐ ప్రేమకుమార్, ఎస్‌ఐలు సుధాకర్, లక్ష్మణ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మంత్రి అడ్లూరిని కలిసిన టిసిఆర్‌పిఎ ఉద్యోగులు



**ప్రజాపక్షం/నిజాంసాగర్:** తెలంగాణ క్లస్టర్ రిసోర్స్ పర్సన్ అసోసి యేషన్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి, గిరిజన సంక్షేమ, దివ్యాంగుల, వయోవృద్ధుల సాధికారిక శాఖ మ ంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను తెలంగాణ సచివాలయంలో మంగ ళవారం కలిశారు. తెలంగాణ సీఆర్‌పీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలిసి వారి సమస్యలను వివరించారు. 15 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న తమకు న్యాయం జరగడం లేదని, చాలీ చాలని వేతనా లతో జీవితాలు కొనసాగిస్తున్నామన్నారు. మానవతా దృక్పథంతో వేతనాలు పెంచి, ఉద్యోగ భద్రత కల్పించాలని వారు కోరారు. ఇందుకు స్పందించిన మంత్రి సీఆర్‌పీల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చినట్లు సీఆర్‌పీ అధ్యక్షుడు తిరం దాస్ సంతోష్‌కుమార్, కార్యదర్శి కె.శ్రీనివాస్‌రెడ్డి, ముఖ్య సలహాదా రులు బి.శ్రీధర్‌కుమార్,డి.శరత్‌కుమార్, యువరాజు పాల్గొన్నారు.

## రేపు విద్యార్థులకు జిల్లా స్థాయి సైకిల్ రేస్ పోటీలు

**ప్రజాపక్షం / హాజీపూర్ :** సంక్రాంతి పర్వది నోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 15వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు జిల్లా స్థాయి సైకిల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు హాజీ పూర్ ప్రెస్ క్లబ్ నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంచిర్యాల మున్సి పల్ కార్పొరేషన్ పరిధిలోని గుడిపేట బుర్జ్ గట్టు హనుమాన్ విగ్రహం ఎదురుగా గల మైదానంలో ఈ పోటీలు జరగనున్నాయని, 7 నుంచి 12 సంవత్సరాల సబ్ జూనియర్స్, 13 నుండి 14 సంవత్సరాల జూనియర్, 15 నుండి 16 సంవత్సరాల సీనియర్స్ విభాగాల్లో బాల బాలికలకు ఈ సైకిల్ రేస్ పోటీలు నిర్వ హిస్తున్నట్లు పేర్కొన్నారు. చిన్నారుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు నిర్వహిస్తున్న ఈ పోటీల్లో పాల్గొనే ఔత్సాహికులు 14వ తేదీ బుధవారం మధ్యాహ్నం 3 గంటల వరకు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మొదటి విజేతకు రూ.3 వేలు, రెండవ విజే తకు రూ.1,500, మూడవ విజేతకు రూ.1,000ల నగదు బహుమతులతో పాటు పాల్గొనే వారందరికీ పతకాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. పూర్తి వివరాలకు 7569114356 9866318360 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

## పాత లైసెన్స్ సర్వేయర్లకు మండలాలు కేటాయించాలి



**ప్రజాపక్షం / జైపూర్ :** భూభారతి అమలులో పాత లైసెన్స్ సర్వేయర్ల సేవలను తప్పనిసరిగా వినియోగించుకోవాలని తెలంగాణ సర్వే అకాడమీ నుంచి శిక్షణ పొందిన సర్వే యర్లు డిమాండ్ చేశారు. మంగళవారం మంచిర్యాలలో జిల్లా ల్యాండ్ సర్వే అధికారి శ్రీనివాస్‌కు వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి కార్యక్ర మంలో లైసెన్స్ సర్వేయర్ల పాత్ర కీలకమని, మొదటి విడత శిక్షణ పొందిన వారితో పాటు కొద్దిమంది పాత లైసెన్స్ సర్వేయర్లకు మాత్రమే ప్రస్తుతం మండలాలు కేటాయించా రని, అనేక మందికి లైసెన్స్ ఉన్నప్పటికీ ప్రభుత్వ పనుల్లో అవకాశం లేక ప్రైవేట్‌గా సర్వే పనులు చేస్తూ జీవనం సాగి స్తున్నామని తెలిపారు. అనుభవం ఉన్న పాత లైసెన్స్ సర్వే యర్లకు మండలాలు కేటాయిస్తే ఉపాధి కల్పించడమే కాకుండా భూభారతి అమలు మరింత సమర్థవంతంగా జరుగుతుందని, అందరికీ సమానంగా అవకాశాలు కల్పిం చాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ వినతిపై స్పందించిన జిల్లా ల్యాండ్ సర్వే అధికారి వి. శ్రీనివాస్, తదుపరి జాబితాలో అర్హులైన పాత లైసెన్స్ సర్వేయర్లకు అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారని సర్వేయర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ లైసెన్స్ సర్వేయర్లు సదయ్య, సుధాకర్, మల్లేష్, లక్ష్మణ్, మేరాజ్, మురళి తదితరులు పాల్గొన్నారు.

## మద్యం మత్తు .. ప్రమాదాలకు మూల కారణం

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** మద్యం మత్తు ప్రమాదాలకు మూల కార ణమని నిజాంసాగర్ ఎస్సై శివకుమార్ అన్నారు. రోడ్డు నిబంధనలు పాటించడం ద్వారా ప్రాణ రక్షణ సాధ్యమని పేర్కొన్నారు. మంగళ వారం నిర్వహించిన రోడ్డు భద్రతా అవగాహన సదస్సులో ఎస్సై మాట్లాడారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీటు బెల్టు ధరించాలని, అతివేగం పనికిరాదని సూచించారు. మద్యం సే వించి వాహనాలు నడపడం ఆత్మహత్యతో సమానమని ఎస్సై హెచ్చ రించారు. ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించి క్షేమంగా గమ్యం చేరాలని ఎస్సై సూచించారు.

## గూడెం లిఫ్ట్ మోటార్లు ప్రారంభించి సాగు నీరు అందించాలి

రఘునాథ్ వెరబెల్లి, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు




**ప్రజాపక్షం / లక్షెట్టిపేట :** గూడెం లిఫ్ట్ మోటార్లను పూర్తి స్థాయిలో ప్రారంభించి రైతులకు చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందించాలని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘు నాథ్ వెరబెల్లి డిమాండ్ చేశారు. మంచిర్యాల నియోజకవ ర్గంలో యాసంగి పంటలకు సాగు నీరు విడుదల చేయా లని కోరుతూ మంగళవారం బిజెపి ఆధ్వర్యంలో లక్షెట్టి పేట పట్టణం ఉత్కూర్ చౌరస్తాలో రైతులు, పార్టీ శ్రేణులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రఘు నాథ్ వెరబెల్లి మాట్లాడుతూ గత 15 రోజుల క్రితం బిజెపి నాయకులు చేసిన పోరాట ఫలితంగా ఈరోజు ప్రభుత్వం గూడెం లిఫ్ట్ లో ఒక మోటార్ ను ప్రారంభించిందని అన్నారు. యాసంగి పంటలకు రైతులు నార్లు పోసి 50 రోజులు దాటినా ఇప్పటి వరకు సాగు నీరు విడుదల చేయ కపోవడంతో నాట్లు ఎండిపోయే ప్రమాదం ఉందని ఆందో ళన వ్యక్తం చేశారు. బిజెపి ఆధ్వర్యంలో ధర్నాకు దిగడంతో ప్రభుత్వం దిగి వచ్చి ఒక మోటారు ద్వారా నీటి విడుదల చేపట్టిందని పేర్కొన్నారు. ఈ నెల 16 లోగా పూర్తి స్థా యిలో మోటార్లు నడిపి సాగు నీరు అందిస్తామని డిఇ హా మీ ఇవ్వడంతో ధర్నా విరమించినట్లు తెలిపారు. చెప్పిన తే దీ లోగా చివరి ఆయకట్టు వరకు నీరు చేరకపోతే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. నాయ కులు కృష్ణ మూర్తి, రాజయ్య, రవి గౌడ్, హరి గోపాల్, స్వామి రెడ్డి, కిషన్, సంతోష్, అశ్విన్, సత్తయ్య, సురేష్, సతీష్, లచ్చన్న, కిషన్‌పాల్గొన్నారు.

## పౌష్టిక ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం



**ప్రజాపక్షం / కౌటాల :** కిశోర బాలికలు పౌష్టిక ఆహారం తీసుకో వడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని సర్పంచ్ కావుడే బిక్కు పటేల్ అన్నారు. మండలం లోని నాగేపల్లి గ్రామ పంచాయతీలో మంగళ వారం నాగేపల్లి అంగన్వాడీ కేంద్రంలో కిశోర బాలికలకు పౌష్టిక ఆహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లా డుతూ కిశోర బాలికలు పౌష్టిక ఆహారం తీసుకోవడం ద్వారా ఆరో గ్యంగా ఉండవచ్చని, ప్రభుత్వం అందిస్తున్న ఇలాంటి సదుపాయా లను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనం తరం నూతన గ్రామ సర్పంచ్‌ను అంగన్వాడీ టీచర్ శకుంతల ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ శకుంతల, కిశోర బాలికలు పాల్గొన్నారు.

## గృహ జ్యోతి పథకం బాండ్లు అందజేత

**ప్రజాపక్షం/తానూర్ :** గృహ జ్యోతి పథకం కింద అర్హులైన వారికి మంగళవారం తానూర్ గ్రామ సర్పంచ్ జాదవ్ సుగంధ బాయి మాధవరావు పటేల్,లబ్ధిదారులకు గృహ జ్యోతి పథకం బాండ్లను స్వయంగా లబ్ధిదారు ల ఇళ్లకు వెళ్లి అందజేశారు.గృహ జ్యోతి లబ్ధి దారులు నెలకు 200 యూనిట్ల వరకు వి ద్యుత్ ఉచితంగా వాడుకున్న కుటుంబాలకు ఎలాంటి చార్జీలు లేకుండా ప్రభుత్వమే చార్జీ లు భరిస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు జాదవ్ గోవింద్ పటేల్, సోమనా థ్ విద్యుత్ అధికారి ఎల్ఎం. కిషోర్, ఏఎ ల్ఎం మహేష్,రాజు,విద్యుత్ పాల్గొన్నారు.



# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**ప్రజాపక్షం / చింతలమానేపల్లి :** ఎన్నో సంవత్సరాల త ర్వాత మళ్లీ కలుసుకున్న గురువు శిష్యుల సమాగమం హృ దయాలను కదిలించేలా సాగిందని రిటైర్డ్ ఉపాధ్యాయులు కర్ల లింగయ్య అన్నారు. చింతలమానేపల్లి మం డలం డబ్బా గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ప్రాంగణంలో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఆదివారం అపూర్వ ఆత్మీయ సమ్మేళన సభను ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా 1965 నుండి 1998 వరకు పాఠ శాలలో విద్యను బోధించిన కర్ల లింగయ్యను పూర్వ విద్యా ర్థులు బాజా భజంత్రీల మధ్య ఘనంగా ఆహ్వానించారు. గురువుకు పాదపూజ నిర్వహించి శాలువా కప్పి జ్ఞాపికను అందజేసి ఘనంగా సన్మానించారు.అనంతరం కర్ల లింగ య్య మాట్లాడుతూ సుమారు 35 సంవత్సరాల క్రితం తా ను బోధించిన విద్యార్థులు నేడు స్వగ్రామంలో తనను ఘనంగా సన్మానించడం పూర్వజన్మ సుకృతమని పేర్కొ న్నారు. ఇది తన జీవితంలో మరచిపోలేని మధుర క్షణ మని ఆనందం వ్యక్తం చేశారు. పూర్వ విద్యార్థుల ప్రేమాభి మానాలు తనకు కొత్త ఉత్సాహాన్ని ఇచ్చాయని తెలిపారు. బాల్య దశలో గురువు చెప్పిన పాఠాలు శిష్యుల జీవితాల్లో మరిచిపోలేని ముద్ర వేసిన జ్ఞాపకాలను ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు గుర్తుచేసుకున్నారు. వివిధ తరాల పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## శ్రీరాంపూర్‌లో సమ్మక్క - సారలమ్మ జాతర దుకాణాల వేలం

ఏరియా జిఎం మునిగంటి శ్రీనివాస్

**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** నస్పూర్ మండలంలోని శ్రీరాంపూర్ ప్రాంతం సిసిసి పరిధిలో ఉన్న ముక్కిడి పోచమ్మ ఆలయం వద్ద సింగ రేణి యాజమాన్యం శ్రీరాంపూర్ ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి 31 వరకు శ్రీ సమ్మక్క సారలమ్మ జాతరను నిర్వహించనున్నట్లు ఏరియా జిఎం మునిగంటి శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. ఈ జాతర సందర్భంగా దుకాణాల ఏర్పాటు కోసం ఈ నెల 19వ తేదీన వేలం పాట నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలి గిన వారు 19వ తేదీన ఉదయం 10.30 గంటలకు ముక్కిడి పోచమ్మ ఆలయం వద్ద జరిగే వేలం పాటలో పాల్గొనవచ్చని సూచిం చారు. జాతర ఏర్పాట్లకు సంబంధించి అన్ని చర్యలు సింగరేణి యాజమాన్యం పర్యవేక్షణలో జరుగుతాయని పేర్కొన్నారు. వ్యాపా రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# మహిళా సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నిర్మల్ జిల్లా కేంద్రంలోని సోఫీ నగర్ బీడీ ఫ్యాక్టరీలో ప్రగతి శీల మహిళా సంఘం (పి.ఓ.డబ్ల్యూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మహిళలకు ఆటల,ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కె.లక్ష్మి మాట్లాడుతూ,ఆటలు శారీరక,మానసిక దృఢత్వాన్ని పెంపొందించడమే కాకుండా జీవితంలో ఉల్లాసాన్ని నింపుతాయని తెలిపారు.మహిళలు గెలుపోటములను సమానంగా స్వీకరించి ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు .మానవ సమాజం అంతరిక్షంలోని గ్రహాల పైకి వెళుతున్నా ,నేటికీ మనుషులలో స్త్రీ పురుష వివక్ష కొనసాగడం అమానుషమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.సామాజంలో మహిళలకు ఇంకా రెండవ శ్రేణి పౌరులుగా చూస్తూ,పురుషాధిక్య భావజాలంతో అణచివేస్తున్నారని లక్ష్మి మండిపడ్డారు.దీని కారణంగానే దేశంలో మహిళలపై లైంగిక దాడులు, హత్యలు పెరిగిపోతున్నాయని,సనాతన ధర్మాల పేరుతో మహిళలపై మరింత అణచివేతలకు పాల్పడుతున్నారని విమర్శించారు.ముఖ్యంగా ఆర్ఎస్ఎస్ ,బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఇలాంటి ఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయని,కోర్టులు కూడా కొన్నిసార్లు నిందితులకు మద్దతుగా నిలవడం ఆమోదయోగ్యం కాదని అన్నారు.మహిళలపై దాడులకు పాల్పడే దోషుల పట్ల కఠినంగా వ్యవహరించాలని, వివక్షకు వ్యతిరేకంగా మహిళా లోకం ఐక్యంగా పోరాడాలని ఆమె పిలుపునిచ్చారు.ఈ పోటీల్లో భాగంగా మహిళలకు కుర్చీ ఆట,బీడీలు చుట్టడం,ముగ్గులు వేయడం వంటి పోటీలను నిర్వహించి విజేతలకు ప్రథమ ,ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకురాళ్లు గంగామణి, లక్ష్మి, రుక్మ,చిట్టి,లలిత,కవితలతో పాటు టీ యూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రాజన్న,జిల్లా కార్యదర్శి రామ లక్ష్మణ్,అధ్యక్షుడు బక్కన్న ,ఎస్. గంగన్న,ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం



**ప్రజాపక్షం/లక్ష్మణచందా :** రోడ్డు భద్రత వారోత్సవంలో భాగంగా మంగళవారం పొట్ట పెల్లి కె.గ్రామంలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో లక్ష్మణచందా ఎస్సై శ్రావణి పాల్గొని ప్రజలందరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని కచ్చితంగా హెల్మెట్ ధరించాలని వేగంతో కూడిన ప్రయాణం సురక్షితం కాదని ప్రతి ఒక్కరూ సరైన పత్రాలు మీ వద్ద ఉంచుకోవాలని మీకంటూ ఒక కుటుంబం ఉంటుంది కావున కుటుంబం కోసమైనా బాధ్యతగా డ్రైవింగ్ చేయాలని మద్య తాగి వాహనాలు నడపకూడదు అంతేకాకుండా మైనర్ డ్రైవిగ్ సురక్షతమైనది కాదు కావున 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు బాధ్యతగా డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలని గ్రామ ప్రజలకు ఉద్దేశించి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముఖేష్,గ్రామ కార్యదర్శి ప్రియాంక రెడ్డి,ఉప సర్పంచ్ పోతుగంటి రవీందర్,వార్డు సభ్యులు ఇతర పోలీస్ సిబ్బంది గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## యోగాబృందం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** యోగా బృందం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించామన్నారు. సంక్రాంతి పండగను పురస్కరించుకుని యోగా బృందం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సరస్వతి విద్యామందిర్ పాఠశాల ఆవరణలో ముగ్గుల పోటీలు ఏర్పాటు చేయగా 35 మంది పాల్గొన్నారని తెలిపారు. పోటీల్లో ప్రథమ బహుమతి కట్ట లాస్య, ద్వితీయ బహుమతి జవ్వాజి ప్రజ్ఞ, తృతీయ బహుమతి రింశా గెలుపొందారు. విజేతలకు రిటైర్డ డీయంఅండ్‌హెచ్‌ఓ ప్రముఖ వైద్యులు బసంత్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. యోగా బృందం సభ్యులు పాల్గొన్నారు.

## లోలం ప్రీమియం లీగ్ (ఎల్.పి.ఎల్-3) విజేతగా లోలం బ్లాస్టర్స్



**ప్రజాపక్షం/దిలావర్‌పూర్ :** నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలోని లోలం గ్రా మంలో నిర్వహించిన లోలం ప్రీమియం లీగ్3(ఎల్.పి.ఎల్ 3) క్రికెట్ టోర్నమెంట్ అత్యంత ఉత్సాహభరితంగా ముగిసింది.యువతను క్రీడల వైపు ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన గ్రామ యువత పెద్ద ఎత్తున పాల్గొని తమ ప్రతిభను చాటారు.

### హోరాహోరీగా ఫైనల్ పోరు..

ఫైనాల్ మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచి లోలం బ్లాస్టర్స్ జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా,ప్యారడైస్ టీమ్ రన్నరప్‌గా నిలిచి ద్వితీయ స్థానాన్ని దక్కించుకుంది.

### బహుమతుల అందజేత..

గ్రామ సర్పంచ్ సాయన్న శ్రీలత,ఉపసర్పంచ్ ముత్యం, వార్డు మెంబర్ హుస్సేన్,డైరెక్టర్ శ్రీహరి ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు.ప్రథమ విజేత(లోలం బ్లాస్టర్స్),5,000 నగదు బహుమతి మరియు ట్రోఫీ,ద్వితీయ విజేత(ప్యారడైస్ టీమ్) 2,500 నగదు బహుమతి,ట్రోఫీ,ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ గ్రామీణ యువత క్రీడల్లో రాణించడం సంతోషదాయకమని,గెలుపోటములను సమానంగా స్వీకరించి క్రీడా స్ఫూర్తిని చాటాలని కోరారు.వివిధ జట్ల కెప్టెన్లు,క్రీడాకారులు,లోలం గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఏలేటి విస్తృతంగా పర్యటన



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి విస్తృతంగా పర్యటించారు. పట్టణంలోని మంజులాపూర్,శాస్త్రీనగర్,శ్రీనగర్,బోయవాడ,ప్రియదర్శిని నగర్ కాలనీలో బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి కాలనీ వాసుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా శాస్త్రీనగర్ శివాలయం తో పాటు,శ్రీనగర్ హనుమాన్ ఆలయాలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం వార్డు లలో సమస్యలు తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రావుల రాంనాథ్,మేడిసెమ్మ రాజు,డా.మల్లికార్జున్ రెడ్డి,పట్టణ అధ్యక్షుడు ఆకుల కార్తీక్,తో పాటు పట్టణ బీజేపీ నాయకులు,తాజా మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## మహిళ అదృశ్యం

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** మండలంలోని మెండోరా గ్రామానికి చెందిన పచ్చగుర లక్ష్మీ అనే 45 సంవత్సరాల మహిళలు ఈనెల 10 న ఉదయం పనుల ని మిత్తం బయటకు వెళుతున్నానని కుటుంబ సభ్యులకు చెప్పి ఇప్పటివరకు రాలేదని భక్త కిషన్ తెలిపారు. కాగా చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా దొరకలేదని ఇంటి నుంచి వెళ్లేప్పుడు ఆమె బూడిద రంగు చీర, గులాబీ రంగు జాకెట్ ధరించి ఉందని భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన: కలెక్టర్



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** సంక్రాంతి పండగను పురస్కరించుకుని కలెక్టర్ ఇలా త్రిపాఠి జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. భోగభాగ్యలనిచ్చే భోగి, సరదాలు పంచే సంక్రాంతి వేడుక ప్రజలందరికి ఆనందం పంచాలని ఆకాంక్షించారు. నూతన సంవత్సరంలో శుభాలు సమకూరాలని, అనుకున్న కార్యాలన్ని నెరవేరాలని, యేడాది పొడుగునా ఇంటింటా సిరుల కాంతులు విలసిల్లాలని అభిలాషించారు.

## తెలంగాణ జన సమితి పార్టీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

**ప్రజాపక్షం /ఇబ్రహీంపట్నం :** ముందస్తు సంక్రాంతి పండుగ లో భాగంగా జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం తెలంగాణ జన సమితి పార్టీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీలలో విద్యార్థుల నుండి మొదలుకొని మహిళలు పాల్గొని రంగురంగుల రంగవల్లికలతో గ్రామ ప్రజలను ఆకర్షించారు. ఈ ముగ్గుల పోటీలలో న్యాయ నిర్ణె తలుగా ఉపాధ్యాయురాలు కవిత ,సరిత లు వ్యవహరించి మొదటి బహుమతి గా వొద్దే ఉషారాణి, రెండవ బహుమతి గా ఆట్నాల ధనశ్రీ, జిల్లా పెల్లి నిత్యాలను ఎంపిక చేశారు. గెలుపొందిన వీరికి తెలంగాణ జన సమితి పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్చార్జి కంతి మోహన్ రెడ్డి బహుమతులను ప్రధానం చేశారు. అనంతరం ముగ్గుల పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జన సమితి పార్టీ నాయకులు చింతకుంట శంకర్,కంతి రమేష్, గూడ రాజారెడ్డి, కాట దశరథ్ రెడ్డి, ఏశల గంగాధర్, జిల్ల పెల్లి దిలీప్, పసునూరి మారుతి, ఒద్దె సోమేష్,కంతి మోసే సంజీవ్, జిల్లా రాజేందర్, మల్లయ్య యాదవ్,చిన్న మల్లయ్య, కిషోర్,నగేష్, తిరుపతి చారి,బంటు గణేష్,మహిళలు, పాల్గొన్నారు.



## రోడ్డు భద్రత నియమాలపై ఆరైవ్ అలైవ్ కార్యక్రమం




**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** మండలంలోని బడాభీమ్‌గల్‌లో సీపీ సాయిచైతన్య ఆదేశాల మేరకు ఆరైవ్ అవైవ్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించామని సిఐ సత్యనారాయణ, ఎస్సై తిరుపతి తెలిపారు. ఈ కార్యక్రమానికి సిఐ సత్యనారాయణ పాల్గొని మాట్లాడుతూ డిఫెన్సివ్ డ్రైవింగ్ ప్రమాదాల బారిన పడకుండా నడపటంపై హెల్మెట్, సీటు బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, డ్రంకెన్ డ్రైవ్ ఎట్టి పరిస్థితుల్లో చేయరాదని, రాంగ్ రూట్‌లో నడపటం, మైనర్ డ్రైవింగ్ లాంటి ఉల్లంఘటనలతో జరిగే నష్టాలపై గ్రామస్తులకు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై తిరుపతి, ఎఎస్సై సత్తార్, కార్యదర్శి రజిత, ఉపసర్పంచ్ శంకర్‌గౌడ్, ప్రజలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం

### ఎస్ఐ.అనిల్ కుమార్:

**ప్రజా పక్షం/ఇబ్రహీంపట్నం :** రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఎస్ ఐ అనిల్ కుమార్ మండల ప్రజలకు పిలుపునిచ్చారు.మంగళవారము అరైవ్,అలైవ్ రోడ్డు సేఫ్టీ ప్రచార కార్యక్రమంలో భాగంగా రోడ్డు ప్రమాదాలతో ప్రాణ నష్టం జరగకుండా రోడ్డు భద్రత నియమాలపై ఎస్ ఐ అనిల్ కుమార్ ప్రజలకు అవగాహన కల్పించారు.

## ల్యాబ్ టెక్నీషియన్లుగా నియామక పత్రాల అందజేత



**ప్రజాపక్షం/ఎడపల్లి:** తెలంగాణ ఆరోగ్య శాఖలో మరో భారీ నియామక పర్వం ఆవిష్కృతమైంది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ రికార్డు స్థాయిలో 1257 మంది ల్యాబ్ టెక్నిషియన్లకు నియామక పత్రాలు అందచేశారు. ఈ క్రమంలో నిజామాబాద్ జిల్లాకు చెందిన 22మంది ల్యాబ్ టెక్నిషియన్లకు డీఎంఈ, డీపీహెచ్ విభాగాల్లో ఈ నియామకాలు జరిగాయి. ఈ సందర్భంగా వారు మంత్రి చేతుల మీదుగా నియామకం పత్రాలను అందుకున్నారు. ఆరోగ్య శాఖ చరిత్రలో ల్యాబ్ టెక్నిషియన్ల పోస్టులను ఇంత పెద్ద మొత్తంలో భర్తీ చేయడం ఇదే తొలిసారని, వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# జగిత్యాల మండలంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రజాబాట

**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల మండలంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రజాబాట కార్యక్రమాన్ని విద్యుత్ ఎడిఈ జవహర్ నాయక్, ఎఈలు శ్రీధర్, సుందర్ ఆధ్వర్యంలో ప్రజా బాట కార్యక్రమాన్ని మంగళవారం రోజున జగిత్యాల అర్బన్ మండలం ధరూర్, పొలాస సెక్షన్ పరిధిలోని తిప్పన్నపేట, గోపాల్ రావు పేట, పోరండ్ల గ్రామాలలో నిర్వహించారు. విద్యుత్ అధికారులు మాట్లాడుతూ ప్రజా బాట కార్యక్రమంలో భాగంగా గ్రామాలలో ఎక్కడైనా లూస్ లైన్లు సమస్యలు, విద్యుత్ ఓల్టేజ్ సమస్యలు, విద్యుత్ సరఫరాలో కానీ ఇంకా ఏదైనా విద్యుత్ సంబంధించిన సమస్యలు ఏమైనా ఉంటే విద్యుత్ సిబ్బందికి వెంటనే తెలియజేయాలని విద్యుత్ పారదర్శకంగా సరఫరా చేయడానికి విద్యుత్ అధికారులు కృషి చేస్తున్నారని అలాగే విద్యుత్ ప్రమాదాల నివారణ పై తీసుకొనే జాగ్రత్తలను గురించి గ్రామ ప్రజలకు రైతులకు సూచించడం జరిగిందని, ఏదైనా విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1912 ను సంప్రదించి తమ సమస్యను అధికారుల దృష్టికి తీసుకు




వచ్చి విద్యుత్ అధికారులకు సహకరించాలని గ్రామాల ప్రజలు రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇంజనీర్ రంజిత్, లైన్స్పెక్టర్ రవిశంకర్ రావు, ఎస్ఎల్ఐ రాజమల్లు, లైన్మెన్లులు రాజలింగం, వేణు, శ్రీనివాస్, ధరూర్ గ్రామ సర్పంచ్ శీలం సురేందర్, ఉప సర్పంచ్ బాలే శ్రీనివాస్, కార్యదర్శి అజయ్, ఎఎల్ఎంలు మహేందర్, శ్రీకాంత్, ముని,వార్డు సభ్యులు గంగన్న, లక్ష్మణ్, విద్యుత్ సిబ్బంది, కారోబర్ వంశీ, విలేజ్ వర్కర్ బషీర్, గ్రామ రైతులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా గోదాదేవి రంగనాథ కళ్యాణోత్సవం



**ప్రజాపక్షం /మల్లాపూర్ :** మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఆలయంలో గోదాదేవి రంగనాథ కళ్యాణ మహోత్సవాన్ని మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. కాగా ప్రధానార్చకులు వెంకట మాధవాచార్యుల కరములచే స్వామివార్లకు ప్రత్యేక పూజలు అభిషేకార్చనలు జరిపించి కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా జరిపించారు. కాగా ఈ కళ్యాణ మహోత్సవంలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.అనంతరం కళ్యాణాన్ని తిలకించిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్, ఉపసర్పంచ్ గడ్డం సోమారెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు డీలర్ మల్లయ్య శరత్ గౌడ్ వార్డు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## బ్యాడ్మింటన్ విజేతలకు బహుమతుల అందజేత

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** మండలంలోని గుండంపల్లి గ్రామ సర్పంచ్ దప్పుల పద్మ నరసయ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు సోమవారం రాత్రి తో ముగిసాయి. రెండు రోజులపాటు నిర్వహించిన బ్యాడ్మింటన్ పోటీల్లో 30 జట్టు పాల్గొనగా, మొదటి విజేతగా జగిత్యాల టీం రెండో విజేతగా గుండంపల్లి జట్టు నిలిచాయి. గ్రామ సర్పంచ్ పద్మ నరసయ్య యువతను ముందుండి క్రీడలతో ప్రోత్సహించడం అభినందనీయమని ప్రజా ప్రతినిధులు అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పుష్పలత నర్సయ్య, గొర్రెపల్లి సర్పంచ్ వెంకట్ రెడ్డి, సిరిపూర్ మాజీ సర్పంచ్ లు నల్ల బాపూరెడ్డి, మామిడి లక్ష్మి రెడ్డి, ఉప సర్పంచ్ లు గంగాధర్ ,సోమ నాగార్జున రెడ్డి, తదితర నాయకులు ఉన్నారు.

# ప్రకృతి సంప్రదాయాలను కుటుంబంతో కలకలిపే పండగ సంక్రాంతి

### జగిత్యాల జిల్లా మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్

**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల పట్టణంలోని శ్రీ కోదండ రామాలయం సన్నిధిలో మంగళవారం సంక్రాంతి ముగ్గుల పోటీలో పాల్గొని విజేతలకు జగిత్యాల జిల్లా మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా మాజీ జడ్పీ చైర్ పర్సన్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ తెలుగువారి ప్రత్యేక పండుగలలో ఒకటి అని సంక్రాంతి పండుగ అంటేనే ముగ్గులు బొబ్బమలు పిండి వంటకాలు పతంగులు గుర్తుకు వస్తాయని వారు అన్నారు. ఇది ప్రకృతిని, వ్యవసాయాన్ని, కుటుంబాన్నీ, సంప్రదాయాలను ఒకే చోట కలిపే పండుగ అని మాజీ జడ్పీ చైర్ పర్సన్ అన్నారు. ఈ మూడు రోజుల పండుగ అందరికి సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలను మరియు సౌభాగ్యం అందించాలని, ప్రజలందరి జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపాలని శుభ భవిష్యత్తును



అందించాలని మనసారా ఆకాంక్షిస్తూ జగిత్యాల నియోజకవర్గ ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలను మాజీ జడ్పీ చైర్ పర్సన్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు అనురాధ, ముప్పల జలజ, రజిత, దీక్షిత, భారతి, రూప, సంధ్య, సంధ్య, స్పందన, నాగరాణి, సరోజ, శైలజ, కవిత, సునీత రాణి, మంజుల, అరుణ, లక్ష్మీ భార్గవి, కృష్ణవేణి, లావణ్య, శ్రీదేవి, శ్వేత, కళావతి, గాయత్రి, శిరీష, శ్రీమేధ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా టీఎన్జీవో సంఘ అభివృద్ధికి కృషి

### జగిత్యాల జిల్లా టీఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు మిర్యాల నాగేందర్ రెడ్డి

**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల జిల్లా టీఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షులు మిర్యాల నాగేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సర్వే మరియు ల్యాండ్ రికార్ధుల శాఖలో ఉద్యోగుల సమావేశం మంగళవారం నిర్వహించి సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టడం జరిగినది.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు నాగేందర్ రెడ్డి మాట్లాడుతూ టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్ మరియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుసేని కృషితో ఉద్యోగుల హెల్త్ స్కీం, నూతన పిఆర్సి, సిపిఎస్ రద్దు వంటి అంశాలపై రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి పరిష్కరామవుతాయని, జగిత్యాల జిల్లాటీఎన్జీవో సంఘ అభివృద్ధికి ఎల్లవేళలా తన వంతు కృషి చేస్తామని టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు మిర్యాల నాగేందర్ రెడ్డి తెలిపారు.ఈనాటి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో జగిత్యాల జిల్లా సర్వే మరియు ల్యాండ్ రికార్డుల శాఖ ఉద్యో



గులు పాల్గొని టిఎన్జీవో జగిత్యాల జిల్లా సంఘం యొక్క సభ్యత్వం తీసుకోవడం జరిగిందని నాగేందర్ రెడ్డి తెలిపారు.తదుపరి జిల్లా సర్వే అధికారి ఆర్.కిషన్ ప్రసాద్ ని కలిసి ముందస్తు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేసారు. సాహెద్ బాబు, ఉపాధ్యక్షులు రవీందర్, డిప్యూటీ ఇన్స్పెక్టర్లు విఠల్ రావు, దేవరావు, కోరుట్ల యూనిట్ అధ్యక్షులు కుమారస్వామి, సర్వే ల్యాండ్ రికార్డ్స్ స్పెషల్ బ్రాంచ్ ప్రెసిడెంట్ దుర్గాప్రసాద్, సెక్రటరి నవీన్ కుమార్, కోశాధికారి జితేందర్ రెడ్డి, సూపరింటెండెంట్ రామకృష్ణ రెడ్డి, ఎస్డిఎం నాగరాజు, సర్వేయర్స్ రమేష్, గంగనర్సయ్య, తిరుపతి, ఉమారాణి, నరేందర్, తంకిన్,తదితరులు పాల్గొన్నారు.

# వార్డు మెంబర్ల ఫోరం అధ్యక్షుడిగా గంగాధర్ నియామకం

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** మల్లాపూర్ మండల వార్డ్ మెంబర్ల ఫోరం అధ్యక్షుడిగా సిర్పూర్ గ్రామానికి చెందిన వార్డ్ మెంబర్ ఇప్ప గంగాధర్ మంగళవారం నియమితులయ్యారు.ఈ మేరకు రాష్ట్ర వార్డు మెంబర్ల పోరం అధ్యక్షులు జక్కని పరంధాములు ఆదేశాలతో నియోజకవర్గ అధ్యక్షురాలు బోయిని జల హనుమాన్లు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. కాగా మంగళవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పెంట సౌజన్య శ్రీనివాస్, మాజీ సర్పంచ్ నల్ల బాపురెడ్డి గంగాధర్ కు నియామక ఉత్తర్వులు అందజేశారు.తన ఎన్నికకు సహకరించిన ప్రజా ప్రతినిధులకు, మండల వార్డు మెంబర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం నూతనంగా ఎన్నికైన గంగాధర్ ను నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సోమ నాగార్జున్ రెడ్డి, వార్డు సభ్యులు మాధవరెడ్డి, పోగుల నారాయణ, సోమయ్య,తదితరులు ఉన్నారు.

## గొల్లపల్లి గ్రామ ప్రజలకు మకర సంక్రాతి శుభాకాంక్షలు

### గ్రామ సర్పంచ్ గడీల శ్రీనివాస్‌గౌడ్

**ప్రజాపక్షం/కొండాపూర్ :**కొండాపూర్ మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామ ప్రజలకు మకర సంక్రాతి పండగ సందర్భంగా గ్రామ సర్పంచ్ గడీల శ్రీనివాస్ గౌడ్ హృదయపూర్వకంగా శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు ప్రజల సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అయిన సంక్రాంతి పండుగ ప్రతి ఇంట్లో ఆనందం ,ఐశ్వర్యం, ఆరోగ్యం , నింపాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గడీల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ సంక్రాతి పండుగ రైతు పండుగగా ప్రసిద్ది చెందిందని రైతుల కష్టం ఫలించి పంటలు సమృద్ధిగా పండేలా దేవుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడాలని యువత విద్యతో పాటు ,ఉపాదిలో ముందుకు సాగాలని మహిళలు అన్ని రంగాల్లో సాదికారత , సాదించాలని ఆకాంక్షించారు. పండుగ వేళా గ్రామ ప్రజలంతా ఐక్యమత్యంతో ,సోదదర బావంతో కలిసి సంక్రాంతిని ఘనంగా జరుపుకోవాలని ఏలాంటి అపశ్రుతులు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ మకర సంక్రాతి పండుగ ప్రతి కుటుంబానికి శాంతి ,సంతోషం సుభిక్షతను తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.

## ముత్తంగిలో ముగ్గుల పోటీలకు హాజరైనా ఎమ్మెల్యే జిఎంఆర్

**ప్రజాపక్షం/పటాన్‌చెరు:**ముత్తంగి డివిజన్ పరిధిలోని సాయి ప్రియ కాలనీలో సంక్రాంతి పర్వదినమను పురస్కరించుకొని సీనియర్ నాయకులు ఆబేద్ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీల కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళల వేసిన ముగ్గులను పరిశీలించి అత్యుత్తమ ముగ్గులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగ ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ సంక్రాంతి పర్వదినం సందర్భంగా ప్రతి ఏటా ముగ్గుల పోటీలు నిర్వహించడం పట్ల అబేద్‌ను అభినందించారు. బహుమతులు గెలుచుకున్న విజేతలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి స్వప్న ,శ్రీనివాస్, మాజీ సర్పంచ్, ఉపేందర్ సీనియర్ నాయకులు ధశరథ్, రెడ్డి ,మేరాజ్ ఖాన్, రామకృష్ణ, రవి తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక సేవలు అభినందనీయం..



**ప్రజాపక్షం/శివ్వంపేట :** సామాజిక సేవా కార్యక్రమాలు ఎప్పటికి గుర్తిండిపోతాయని మండల పరిషత్ మాజీ కోఆప్షన్ మెంబర్ ఎండి లాయక్, మండల ప్రచార కార్యదర్శి బుద్దుల మమతభిక్షపతి అన్నారు. ఇటీవల గ్రామపంచాయతీ ఎన్నికలలో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసిన నీరుడి సుశీలబాబు తన సొంతంగా దొంతి గ్రామంలోని 9వ వార్డులో వేయించిన మంచినీటి బోరులో వార్డుసభ్యులుగా గెలుపొందిన పిట్ల కృష్ణ తన సొంతంగా ఏర్పాటు చేసిన బోరు మోటరును ఎస్ఐ మధుకర్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా లాయక్ మాట్లాడుతూ గెలుపోటములతో సంబంధం లేకుండా గ్రామానికి సేవ చేయాలనే సదుద్దేశ్యంతో నీరుడి సుశీల బాబు, పిట్ల కృష్ణ సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం అన్నారు. మంచినీటి మోటరును ఏర్పాటు చేసేందుకు కృష్ణను గ్రామస్థులు, వార్డు ప్రజలు అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మౌనికమురళి, పంచాయతీ కార్యదర్శి శేఖర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ లక్ష్మి కుమార్, బుద్దుల భిక్షపతి, కొదాస్ స్వామి, మొగుడంపల్లి ఆనంద్, సంతోష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## గృహజ్యోతి బాండులను పంపిణీ

**ప్రజాపక్షం/నిజాంపేట్:**నిజాంపేట మండల పరిధిలో నగరం గ్రామంలో గృహ జ్యోతి గ్రీటింగ్స్ ను గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద లబ్దిదారులకు అందించుట జరిగింది. ఈ కార్యక్రమంలో నగరం ఉప సర్పంచ్ గుగ్లోత్ నాజం, లైన్ మెన్ సుశాంత్, పంచాయతీ కార్యదర్శి మొహమ్మద్ ఆరీఫ్ హుస్సేన్, గుగ్లోత్ దేవేందర్, గుగ్లోత్ రవి, ఉప్పలయ్య లబ్ధి దారులు పాల్గొన్నారు.

# జనగామ జిల్లాకు ధోకా లేదు

### మార్చే పరిస్థితి వస్తే ఉద్యమమం

### పల్లా ప్రజల్ని ఆయోమయానికి గురి చేయొద్దు



**ప్రజాపక్షం/జనగామ :** జిల్లాల మార్పులో జనగామకు ఎలాంటి ధోకా లేదు. ఒక వేల మార్చే పరిస్థితి వస్తే ఉద్యమమం చేస్తామని డిసిసి అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి అన్నారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి రాజకీయ లబ్ధి కోసం ప్రజల్ని అయోమయానికి గురి చేస్తున్నారని మండిపడ్డారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మారుజోడు రాంబాబు, టిపిసిసి సభ్యులు లకావత్ లక్ష్మి నారాయణ నాయక్, చెంచారపు శ్రీనివాస్‌రెడ్డితో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. జిల్లా మారుతున్నట్లు పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రజల్ని రెచ్చగొట్టడం సరియైంది కాదని, కొట్లాడి తెచ్చుకున్న జనగామ జిల్లా ఏర్పాటులో పల్లా పాత్ర ఏమీ లేదన్నారు. తెలంగాణ ఏర్పడగానే 11వ జిల్లాగా జనగామ ఉంటుందని ప్రకటించిన కేసీఆర్ ప్రజల పోరాటం ఫలితంగా విధిలేక 33 జిల్లాల్లో చివరిదిగా జనగామను ప్రకటించారన్నారు. జనగామ జిల్లా ఏర్పాటు కోసం అనేక ఉద్యమాలు జరిగాయని, ఆ ఉద్యమాల్లో పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బిఆర్ఎస్ శ్రేణులు ఎక్కడా లేరన్నారు. జిల్లాలు శాస్త్రీయంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచిస్తున్నారని, ఒకే నియోజకవర్గంలోని కొన్ని మండలాలు ఒకొక జిల్లాలో ఉండడం వలన ఎన్ని సమస్యలు వస్తున్నాయో పల్లా రాజేశ్వర్‌రెడ్డి చెప్పాలన్నారు. సిద్దిపేట లాంటి జిల్లాను 24 మండలాలతో ఏర్పడితే జనగామను 12 జిల్లాలకు కుదించారని, చేర్యా, కొమురవెల్లి, మద్దూర్ మండలాలను సిద్దిపేటలో ఎందుకు కలిపారని ప్రశ్నించారు. ఒక నియోజకవర్గం పూర్తిగా ఒకే జిల్లాలో ఉండడం వలన పాలనా పరంగా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉంటుందన్నారు. ఇందు కోసం కమటి వేసి అధ్యయనం తరువాతనే జిల్లాల పునర్వ్యభజన ఉంటుందని ప్రభుత్వం స్పష్టంగా చెప్పిందన్నారు. వరంగల్ నగరాన్ని రెండు జిల్లాలుగా విడగొట్టడం సరియైంది కాదని అక్కడి ప్రజలు, రాజకీయ నాయకులు చెబుతున్నారు తప్ప జనగామ లాంటి జిల్లాలు ఎత్తేస్తారని ఎక్కడా చెప్పలేదన్నారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి రాజకీయంగా లబ్ధి పొందడం కోసం ప్రజల్ని అయోమయానికి గురి చేస్తున్నారని, జనగామ మున్సిపల్ ఎన్నికల్లో జిల్లా విషయాన్ని ముందుకు తీసుకురావాలని చూస్తున్నారన్నారు. జనగామ మున్సిపాల్టీని కైవసం చేసుకుంటామని చెబుతున్న చెబుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి జనగామ కాంగ్రెస్ అడ్డా అనే విషయం మరిచిపోవద్దు అన్నారు. 30 వార్డుల్లో 28 వార్డుల్లోనూ కాంగ్రెస్ గెలుస్తుందని, గెలిపించి చూస్తామన్నారు. జిల్లా మార్పుపై కడియం శ్రీహరి ఎలాంటి వాఖ్యలు చేయలేదని, జనగామ జిల్లా ఏర్పాటులో కడియం పాత్ర ఎక్కువగా ఉందనే విషయాన్ని మరిచిపోవద్దు అన్నారు. ప్రజల్ని అయోమయానికి గురిచేస్తే పల్లా రాజేశ్వర్‌రెడ్డి వాఖ్యల్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, ప్రజలు ఎవరు నమ్మవద్దు అన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు సిహెచ్ రాజమౌళి, లొక్కుంట్ల ప్రవీన్, మార్కెట్ కమిటి ఛైర్మన్ బనుక శివ రాజ్ యాదవ్, లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి, వేమళ్ల సత్యనారాయణరెడ్డి, వై సుదాకర్, ఉడుత రవి యాదవ్, అభిగౌడ్, వంగాల మల్లారెడ్డి, కరుణాకర్ రెడ్డి, బడికె ఇందిర, ఆలేటి సిద్దిరాములు, బొట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**జనగామను రద్దు చేయడం జరగదు : కొమ్మూరి**

జనగామ జిల్లాను రద్దు చేయడం జరగదని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంఛార్జీ కొమ్మూరి ప్రతాప్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయనొక ప్రకటన చేస్తూ పల్లా రాజేశ్వర్‌రెడ్డి జిల్లాను రద్దు చేస్తున్నారని చెప్పడం సరియైంది కాదన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల కోసమే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఇలాంటి ఎత్తులు వేస్తున్నారని, ప్రజల్ని అయోమయానికి గురి చేసి లబ్ధి పొందాలని చూస్తున్నారన్నారు. జిల్లా ఏర్పాటులో బిఆర్ఎస్ పాత్ర ఏమీ లేదని, కాంగ్రెస్, బిజెపి, సిపిఐ, సిపిఎం కలిసి ప్రజల్ని ఏకం చేసి పోరాటం చేస్తేనే జిల్లా వచ్చిందన్నారు. ప్రభుత్వంలో ఉండి కూడా పల్లా ఏం చేయలేకపోయారని, నేడు అభివృద్ధి కోసం ఒక్క రూపాయి తీసుకురాకపోగా, వచ్చిన నిధులు తానే తెప్పించానని ప్రచారం చేసుకుంటున్నాడన్నారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాటలు ఎవరు నమ్మొదని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# వైభవోపేతకంగా గోదాదేవి కళ్యాణ మహోత్సవం

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ తిరుమలనాథ స్వామి ఆలయంలో మంగళవారం గోదాదేవి రంగనాయకి ల కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పురోహితులు వెంకట రామ్మోహన్ శర్మ మాట్లాడుతూ, తిరుమల స్వామి ఆలయంలో అత్యంత వైభవపేతంగా ముగించుకుని గోదాదేవి రంగనాయకుల కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించామన్నారు. ఈ కళ్యాణ మహోత్సవంలో పెద్ద ఎత్తున భక్తులు వచ్చి స్వామివారి కృపకు పాత్రులు అయ్యారని ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించుకోవడం సనాతన ధర్మానికి ఎంతో ఉపయోగపడతాయని.ఆ స్వామివారి కృప మండల గ్రామ ప్రజలపై ఉండాలన్నారు. అనంతరం ఆలయ,అన్నదాన వితరణ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. మండల ప్రజలందరికీ సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే గోదాదేవి కళ్యాణ మహోత్సవంలో స్థానిక ఎస్ ఐ రాజేష్ పాల్గొని రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు.ఈ ఈకార్యక్రమంలో ఆలయ ఏవో రవికుమార్, ముత్యంరెడ్డి, ఆలయ చైర్మన్ అక్కల రాంరెడ్డి, డైరెక్టర్లు బాజా రమేష్, ఎల్లా గౌడ్, కాకి రాజయ్య, రాజిరెడ్డి, రాజు, గ్రామ సర్పంచ్ బొమ్మెన మల్లేశం, ఉప సర్పంచ్ ఆకుల మహేందర్, అబ్బా రెడ్డి, లింగమూర్తి, గందే రాములు, బిక్షపతి, మధు, వీరముల్లు బాలకృష్ణ, నాయిని వెంకటేశం, శ్రీనివాస్, శ్యామ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# భూ భారతి అక్రమాలపై విచారణ ముమ్మరం

### పోలీసుల అదుపులో 16 మంది

### మరికొందరిని విచారిస్తున్న పోలీసులు

### నేడు మీడియా ముందుకు దోషులు



**ప్రజాపక్షం/జనగామ :** భూ భారతి అక్రమాలపై విచారణ ముమ్మరమైంది. పోలీసుల అదుపులో 16 మంది ఉండగా మరికొంత మందిని విచారిస్తున్నారు. జనగామ పట్టణంలోనే కాకుండా పాలకుర్తి లాంటి పల్లెటూర్లకు సైతం వీరి మోసాలు పాకినట్లు తెలుస్తుంది. మంగళవారం విచారణ పూర్తి చేసి దోషులను బుధవారం మీడియా ముందుకు తీసుకొచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుంది.

భూ భారతి పోర్టల్‌లో లొసుగుల్ని ఆసరా చేసుకొని కోట్ల రూపాయలు కొల్లగొట్టిన మీసేవ, ఇంటర్నెట్ కేంద్రాల మోసాలు ఈ నెల 8న జనగామ జిల్లా కేంద్రంగా వెలుగులోకి రాగా జనగామ తహశీల్దార్ హుస్సేన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ ప్రారంభించారు. జనగామ ఎసిపి ఐఎఎల్ అధికారి దీనికి సారధ్యం వహిస్తూ పూర్తి విచారణ మొదలు పెట్టారు. జిల్లాలోని మీ సేవా, ఇంటర్‌నెట్ కేంద్రాలే కాకుండా పక్క జిల్లాల్లోని మోసాలపైనా ఆరా తీశారు. యాదాద్రి జిల్లాకు చెందిన వారు ఎక్కువగా ఉండడంతో ఆ జిల్లా పోలీసుల సహకారంతో విచారణ జరుగుతుంది. క్రైం పార్టీలను సైతం రంగంలోకి దింపి వారి ఫోన్ నెంబర్లు, ఎవరి ఎవరికి లింక్‌లు ఉన్నాయనే విషయంపైనా ఆరా తీశారు. సోమవారం విచారణ పూర్తి అయినప్పటికి పక్కా ఆదారాలు, ఎంత డబ్బు అక్రమార్కులు కొల్లగొట్టారు అనే విషయంపై మంగళవారం డిసిపి రాజమమేంద్రనాయక్ సారధ్యంలో సమీక్ష నిర్వయించారు. అనుమానితుల బ్యాంక్ ఖాతాలను సైతం సీజ్ చేశారు. వారి అకౌంట్లో ఎంతెంత డబ్బు జమ అయ్యింది అనే విషయాన్ని సైతం ఆరా తీశారు. జనగామ, యాదాద్రి జిల్లా కేంద్రాలుగా ఈ రాకెట్ దంగా జరగగా సుమారు వంద కోట్లకు పైగానే వీరు కొల్లగొట్టినట్లు తెలుస్తుంది. ఈ విషయం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించడంతో జనగామ జిల్లాలో విచారణ పూర్తి చేసి దోషుల అరెస్ట్, రిమాండ్ అనంతరం ఇతర జిల్లాలపై దృష్టి పెట్టే అవకాశం ఉంది.

**తహశీల్దార్ కార్యాలయంలో పూర్తి వివరాల సేకరణ**

కాగా కేసు విచారణలో జనగామ సిఐ సత్యనారాయణ రెడ్డి మంగళవారం జనగామ తహశీల్దార్ కార్యాలయంలో పూర్తి వివరాలు సేకరించినట్లు సమాచారం. తహశీల్దార్ హుస్సేన్‌తో సమావేశమై ఎన్ని రిజిస్టేషన్లు అయ్యాయి, ఎన్ని రిజిస్టేషన్ల డబ్బులు తక్కువగా జమ చేశారు, ఏఏ సెంటర్ నుండి దందా జరిగిందనేది తేల్చినట్లు తెలుస్తుంది. కాగా కొందరు స్వతంత్రంగా తాము చేసిన పొరపాట్లను ఒప్పుకోగా కొందరు మాత్రం ఒప్పులేదని తెలుస్తుంది. వారి నుండి సమాచారం ఎలా రాబట్టాలనే దానిపై పోలీసులు కసరత్తు చేస్తున్నారు.

**జనగామలో ఒక సెంటర్ కేంద్రంగా దందా**

జనగామలో తహశీల్దార్ కార్యాలయానికి దగ్గరలో ఉన్న ఒక సెంటర్ కేంద్రంగా భూ భారతి మోసాల దందా ఎక్కువగా జరిగినట్లు తెలుస్తుంది. అయితే ఆ సెంటర్ నిర్వాహకుడిని పట్టుకొని త్వరగా విడిచిపెట్టడంపై అనుమానాలు రేకెత్తున్నాయి. ఆ నిర్వాహకులు తమకు ఎలాంటి సంబందం లేదంటు గల్లా ఎగరవేసుకొని తిరుగుతున్నట్లు చర్చించుకుంటున్నారు. ఆయనను వదలి పెట్టడానికి కూడా కొన్ని కారణాలు ఉన్నట్లు సమాచారం. ఏదీ ఏమైనా జనగామ కేంద్రంగా జరిగిన భూ భారతి మోసాల చిట్టా త్వరలోనే పోలీసులు బయటపెట్టే అవకాశాలు ఉన్నాయి.

## సంక్రాంతి ముగ్గుల పోటీలు

**ప్రజాపక్షం/అల్లాదుర్గం :** మండలం పరిధిలోగల బహిరందిబ్బ గ్రామంలో సర్పంచ్ వీరప్ప ఆధ్వర్యంలో మంగళవారం సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ లక్ష్మి శేషారెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, సంక్రాంతి సంబురాలలో మహిళ సోదరీమణులు భాగస్వాములు కావడం అభినందనీయం అని, మన సంసృతీ సంప్రదాయాలను, సంక్రాంతి పండుగ విశిష్టత ను నేటి తరం వారికి తెలియచేయడం ఈ ముగ్గుల పోటీ ప్రత్యేకత అని, సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించడం చాలా అభినందనీయమన్నారు. సంక్రాంతి వాతావరణం ముందే వచ్చినట్టు కనిపిస్తుందని, సంక్రాంతి పండుగను పల్లె వాతావరణం ను ప్రతిబిబించేలా ఈ ముగ్గులు సంక్రాంతి పర్వదినం ను ప్రతిబింబించేలా ఆకట్టుకున్నాయి అని వాటి ని వేసిన వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్లాదుర్గం సర్పంచ్ల ఫోరం ఉపాధ్యక్షురాలు సౌమ్య సురేష్ గౌడ్, సర్పంచ్ వీరన్న, జైపాల్, విశ్వేశ్వర్, చెన్నప్ప, పాపయ్య, బక్కన్న, అంజయ్య, శ్రీకాంత్, నర్సింలు, స్వరూప, వీరమని, నాయకులు, కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఉప సర్పంచుల పోరం మండల కమిటీ ఎన్నిక

### అధ్యక్షులుగా ఏ నర్సా గౌడ్, ఉపాధ్యక్షులుగా జి.నవీన్, ప్రధాన కార్యదర్శిగా వి.సురేష్

**ప్రజాపక్షం/నర్సాపూర్ :** నర్సాపూర్ ఉప సర్పంచుల ఫోరం మండల కమిటీని మంగళవారం మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 20 మంది ఉప సర్పంచ్ లు సమావేశం ఏర్పాటు చేసుకొని ఉప సర్పంచ్ ల మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా ఎల్లాపూర్ ఉప సర్పంచ్ ఏ నర్సా గౌడ్ గౌడ్, ఉపాధ్యక్షులుగా అచ్చంపేట ఉప సర్పంచ్ జి.నవీన్, ప్రధాన కార్యదర్శిగా రంజాతాండా ఉప సర్పంచ్ సురేష్, గౌరవ అధ్యక్షులుగా పెద్ద చింతకుంట ఉపసర్పంచ్ కుమ్మరి అంజయ్య, కార్యవర్గ సభ్యులుగా ఇబ్రహీంబాద్ ఉప సర్పంచ్ దాడిగా బాలయ్య తో పాటు మరో కొంతమందిని ఎన్నుకున్నారు. అయితే ఉప సర్పంచ్ ల ఫోరం మండల కమిటీని సర్పంచుల ఫోరం మండలాధ్యక్షులు మధుకర్ రెడ్డి, ఆవంచ సర్పంచ్ స్రవంతి కర్ణాకర్, కొండల్ రెడ్డి మాజీ సర్పంచులు జితేందర్ రెడ్డి ,సేనాధిపతి, రవిలు సన్మానించారు.

## రేగోడ్‌లో గ్రామపంచాయతి వద్ద రోడ్డు ప్రమాదాలపై అవగాహన సదస్సు

### అవగాహన లేకనే ప్రమాదాలు తహసీల్దార్ దత్తారెడ్డి

**ప్రజాపక్షం/రేగోడ్ :** వాహనదారులకు సరైన అవగాహన లేకపోవడం తో ప్రమాదాలు జరుగుతున్నాయని తహసీల్దార్ దత్తారెడ్డి ఎస్సై పోచయ్య అన్నారు మంగళవారం రేగోడ్ గ్రామపంచాయతీ వద్ద రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు ఈ సందర్బంగా పలువురు వారికి జరిగిన ప్రమాదాల గురించి వివరించారు రేగోడ్ గ్రామానికి చెందిన వెన్నెల రాజు తన కుమారుడు నారాయణఖే వెళ్లే తిరిగి వస్తుండగా హెల్మెట్ లేనందు త్రిబుల్ రైడ్ ఉండడం వల్ల బండి కంట్రోల్ కాక ప్రమాదం జరిగి మరణించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వట్టిపల్లి మార్కెట్ కమిటీ యాడ్ డైరెక్టర్ శ్రీధర్ గుప్తా రేగోడ్ మాజీ సర్పంచ్ విజయభస్కర్ మాజీ కోఆప్షన్ చోటు మియా కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు చక్రపాణి మల్లికార్జున్ కృష్ణ తదితరులు ఉన్నారు.

## రాష్ట్ర ఫెడరేషన్ ఆమోదంతో గంగాధర్ చేరిక

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** మెదక్ జిల్లా ఎఐటియుసి కార్యవర్గ కౌన్సిల్ సమావేశం మెదక్ జిల్లా నిజాంపేట మండల కేంద్రంలో జరిగింది. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు ఏఐటీయూసీ లోపే గంగాధర్ చేయడం జరిగింది. ఏఐటీయూసీ మెదక్ జిల్లా కమిటీ ఆమోదంతో వారిని ఏఐటీయూసీ లోకి ఆహ్వానించడం జరిగింది. తెలంగాణ రాష్ట్ర బీడీ వర్కర్స్ ఫడరేషన్ మెదక్ జిల్లా యూనియన్ లో ఏ గంగాధర్ చేయడం జరిగింది. రాష్ట్ర ఫడరేషన్ నాయకత్వం అందరి ఆమోదంతో ఈ నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాజిరెడ్డి, బీడీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అయ్యవారు లక్ష్మణ్, సిద్దిపేట జిల్లా ఎఐటియుసి అధ్యక్షులు రంగారెడ్డి, గంగాధర్,పార్వతి బాలా గౌడ్, దాసు సంతోష, నందం కేశవులు తదితరులు పాల్గొన్నారు.